# పచ్చదనం పెంచితేనే భావితరాలకు ఆరోగ్యకర మైన భవిష్యత్







సోమవారం 7 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

# కుప్టి బ్రిడ్జిపై మృత్యుకుహారం..

బ్రేక్‌ఫెయిల్‌తో ఐదు లారీలు ఢీ.. నుజ్జునుజ్జైన క్యాబిన్లు

ఒకే మార్గంలో వేలాది వాహనాలు.. గంటల తరబడి ట్రాఫిక్ జామ్

అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే దుస్థితి

## మూడో రోజూ అదే నరకం!

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఎన్‌హెచ్--44 కుప్టి బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. బ్రిడ్జి స్లాబ్ దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు తేలడంతో పాటు భారీ రంధ్రం ఏర్పడి పక్షం రోజులు గడుస్తున్నా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.






# బాసరలో రూ.354 కోట్లతో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం

మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

# అంబేద్కర్ చరిత్రను వక్రీకరిస్తే ఊరుకోం!

**'కల్పిత నాయకుడు' పుస్తకంపై ఎస్సీ సంక్షేమ సంఘం ఫైర్**
**హమర ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి.. ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం**
**రాజ్యాంగ నిర్మాతను కించపరిచే ప్రచారాన్ని అడ్డుకోవాలని డిమాండ్**



**ఆసిఫాబాద్ , సెప్టెంబరు 6 ప్రజా జ్యోతి** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్ర, వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడాన్ని ఎస్సీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు' గా పేర్కొంటూ పుస్తకాన్ని ప్రచురించి త్వరలో ఆవిష్కరించనున్నట్లు ప్రచారం చేస్తున్న హమర ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని కోరనున్నట్లు ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి దిలీప్‌కుమార్ తెలిపారు. కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడి పిలుపు మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జాడి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడిపై నిర్ధారణ లేని సమాచారం, అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

**'కల్పిత నాయకుడు' పేరుతో ప్రచారం**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకాన్ని రూపొందించి, త్వరలో విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దిలీప్‌కుమార్ తెలిపారు. పుస్తకంలో పేర్కొన్న అంశాలు వాస్తవ ఆధారాలతో ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. అంబేద్కర్ చరిత్రను వక్రీకరించేలా, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సమాజంలో అశాంతికి దారితీసే అవకాశం**

అంబేద్కర్ దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై విశేష ప్రభావం చూపిన నాయకుడని వారు పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర, ఆలోచనా విధానంపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా నిర్ధారణ లేని సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల సమాజంలోని వివిధ వర్గాల మధ్య అపార్థాలు, విద్వేషాలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని అధికారులు పరిశీలించి, అందులోని అంశాలపై వాస్తవ నిర్ధారణ చేయాలని కోరారు. ప్రచారం వెనుక ఉద్దేశం ఏమిటి? పుస్తకంలో ఏ అంశాలను పొందుపరిచారు? వాటికి ఆధారాలు ఉన్నాయా? అనే కోణాల్లో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం**

ఈ అంశంపై త్వరలో జిల్లా ఎస్పీని కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయనున్నట్లు జాడి దిలీప్‌కుమార్ తెలిపారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ గౌరవానికి భంగం కలిగించే ఎలాంటి ప్రచారాన్నైనా చట్టపరమైన మార్గాల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాటం**

ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాందేకార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంబేద్కర్ గౌరవాన్ని కాపాడేందుకు, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లో మరింత బలపరిచేందుకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఆయనపై నిరాధారమైన ప్రచారం జరిగితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పోరాడుతామని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు, రాజకీయ కోణాలకు అతీతంగా అంబేద్కర్ రాజ్యాంగ విలువలను గౌరవించాలని కోరారు.

**సంఘం నాయకుల హెచ్చరిక**

అంబేద్కర్ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాస్తవాలను పరిశీలించకుండా ప్రచారం చేసే సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. అంబేద్కర్ గౌరవం, రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే అంశాలపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాందేకార్ రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చప్పిడి సురేష్, మల్లెపల్లి రాజనర్సయ్య, నాయకులు చంద్రశేఖర్, సదానందం, రమాదేవి, ప్రమీల, సుజాత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# మీడియా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులకు సన్మానం



**జన్నారం,సెప్టెంబర్6(ప్రజాజ్యోతి)** లక్షెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తాళ్లపేట కు చెందిన నిజామొద్దీన్, జన్నారం మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యక్షులు ఎన్. రాజేష్ లను ఆదివారం రోజున పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యల పరిష్కారం లో మీడియా పాత్ర కీలకమని అన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ ఇలాగే ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రేండ్లగూడ ప్యాక్స్ ఛైర్మెన్ అల్లం రవి,మాజీ ఎంపిటిసి రియాజుద్దీన్, పెతిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి,విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు వేయికండ్ల రవి చారి, బంజారా సంఘం జిల్లా నాయకులు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

**ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్**
**ఖానాపూర్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఘనంగా ఉట్టికొట్టుడు కార్యక్రమం**
**విజేత పద్మావతి నగర్**



**ఖానాపూర్ సెప్టెంబర్ 6(ప్రజాజ్యోతి )**సనాతన హిందూ ధర్మాన్ని సంప్రదాయాలను కాపాడు కోవాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్ అన్నారు శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఖానాపూర్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి వరకు భక్తులు కోలాహలంలో ఉట్టికొట్టుడు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఆలయంలో ఆగమ పండితులు స్థానచార్యులు శ్రీ చక్రపాణి నరసింహమూర్తి స్వామివారికి వేదోక్త అర్చనలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి పోలంపెల్లి రమేష్, కమిటీ సభ్యులు పాకుడు గుంజలకు పూజలు నిర్వహించిన అనంతరం పిల్లలు, యువకులు ఉత్సాహంగా గుంజ పాకారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్మెన్ అంకం మౌనిక కౌన్సిలర్, బొప్పరపు సత్యవతి అనంతరం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కూడా ఉట్టికొట్టుడు కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎస్.ఐ. రాహుల్ గౌక్వాడ్ పర్యవేక్షణలో కార్యక్రమాలు సజావుగా సాగాయి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, కోశాధికారి ఉషాకోల సుధాకర్ సభ్యులు లింగాల రాము, తుమ్మనపెల్లి లక్ష్మణ్, వెన్నం అంజయ్య, నడిమెట్ల రమేష్, కుందారపు నారాయణ, రామ్ చిన్న భీమన్న, రామన్వేష్, లింగాల లక్ష్మణ్, శంకర్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంత్రరాజ్యం సురేష్, వ్యవస్థా పాకులు బుక వెంకటేశ్వర్లు,బిసి రాజన్న పడాల రాజశేఖర్ శెట్టి శ్యామ్ మోహన్ రావు రాపెల్లి రాజు రాచమల్ల రాజశేఖర్ బిసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తర్ణం (బి) లో ఘనంగా 'నవోల' పండుగ



**నేరడిగొండ, సెప్టెంబర్ 06 (ప్రజా జ్యోతి):** మండలంలోని తర్ణం (బి) గ్రామంలో ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం 'నవోల' పండుగను కుంరం పరివార్ కుటుంబ సభ్యులంతా కలిసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుంరం కుటుంబ పెద్దలు మాట్లాడుతూ.. తమ ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం కొత్త పంటలను విత్తకముందు, అలాగే పంటల కోతలు ప్రారంభించే ముందు 'నవోల' పండుగను భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో జరుపుకోవడం ఆచారంగా వస్తోందని తెలిపారు. ఈ పండుగ పూర్తి చేసిన తర్వాతే కూరగాయలతో పాటు ఎలాంటి పంటనైనా కోయడం (చేతికి తీసుకోవడం) జరుగుతుందని వివరించారు. ప్రకృతిని, పంటలను పూజించడం తమ సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంరం భీమ్రావు, పటేల్ తులసీరామ్, గంగారాం, అమృత రావు, సుదర్శన్, రామారావు, ఇంద్రు, శంకర్, మధుకర్, సంతోష్ తదితర కుంరం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 10 న హైదరాబాద్ లో జరిగే మహాధర్నా జయప్రదం చేయాలి

**-- జేఏసీ రాష్ట్ర నాయకులు**



**జన్నారం,సెప్టెంబర్6(ప్రజాజ్యోతి)** తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్ లో చేపట్టబోయే మహా ధర్నాను ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర నాయకులు, జాడి రాజన్న,జాదవ్ వెంకట్ రావు లు పిలుపునిచ్చారు. జన్నారం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.?ప్రభుత్వం తక్షణమే స్పందించి రెండవ పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, నిలిచిపోయిన ఆరు డీఏ (కరవు భత్యం)లను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్ బిల్లుల బకాయిలతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు.పర్యవేక్షణ అధికారుల నియామకానికై పటిష్టమైన సర్వీసు రూల్స్ రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. వీటికి తోడుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేలా హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయాలని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇవేకాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్త 64 సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10 న హైద్రాబాద్ లో జరిగే మహాధర్నా కార్యక్రమానికి రాష్టం లోని అన్ని జిల్లాలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్, తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామటేంకి శ్రీనివాస్, అధ్యక్షులు తుంగూరి గోపాల్,రాథోడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలు, తప్పుడు రిజిస్ట్రేషన్లతో భూ కబ్జాకు యత్నం

ఇద్దరు అరెస్ట్ జైనథ్ సీఐ జి. శ్రవణ్ కుమార్

వారసత్వ వ్యవసాయ భూ మిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన నిందితులు

ఫోర్జరీ, మోసం, తప్పుడు వ్యక్తిత్వంతో రిజిస్ట్రేషన్ చేసినట్లు కేసు నమోదు

ప్రధాన నిందితుడితో పాటు మరో వ్యక్తి అరెస్ట్ -- మరో ముగ్గురు పరారీ




**జైనథ్, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధి లోని భోరాజ్ మండలం రాం పూర్-టి గ్రామంలో వారస త్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని నకిలీ పత్రాలు, తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఇద్దరు నిందితు లను శనివారం జైనథ్ పోలీసులు అరెస్ట్ చేశారు. భోరాజ్ మండలం రాంపూర్-టి గ్రామంలోని సర్వే నంబర్ 30 (పాత), మొత్తం విస్తీర్ణం 7 ఎకరాల 29 గుంటల వ్యవసాయ భూమి 1987 సంవత్సరం నుంచి ఫిర్యాదు దారుడి తండ్రి సయ్యద్ ఖుద్రత్ అలీ పేరున ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి మరణానంతరం చట్టబద్ధంగా వారసుల మధ్య భూమి విభజన జరిగి, ఫిర్యాదు దారు సయ్యద్ సఫ్దర్ అలీకి 3 ఎకరాల 35 గుంటలు, సయ్యద్ ఆరిఫ్ అలీకి 3 ఎకరాల 34 గుంటల భూమి వచ్చింది. ఫిర్యాదుదారు 31- 12-2025న భూమికి సం బంధించిన వాల్యుయేషన్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగా తమకు తెలియకుండా భూమికి సంబంధించిన కొన్ని సేల్ డీడ్లు రిజిస్ట్రేషన్ అయి ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైనట్లు గుర్తించారు. దీని పై ఫిర్యాదుదారు పోలీసులను ఆశ్రయించగా, నకిలీ పత్రాలు సృష్టించి, తప్పుడు వ్యక్తిత్వం, మోసపూరిత విధానాలతో భూమిని ఇతరుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రే షన్ చేయించినట్లు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నంబర్ 108/2026 318(4), 336(3), 34 0(2) దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**అరెస్టయిన నిందితులు**

ఎ-1 మహేష్ కుమార్ ఖేతాన్ (76), భూక్తాపూర్, ఆది లాబాద్.

ఎ-4 మహమ్మద్ ఇబ్రహీం అక్బానీ ఏ మామ్లా సేఠ్ (63), భూక్తాపూర్ కాలనీ, ఆదిలాబాద్.

**పరారీలో ఉన్న నిందితులు**

ఎ-2 ఉట్ల గణపతి,ఎ-3 ఉట్ల ఓంప్రకాశ్,ఎ-5 సూరజ్ సేఠ్‌లు పరారీలో ఉన్నారు. కేసులో నిందితులు పరస్పరం కుమ్మక్కై నకిలీ పత్రాలు, తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించి, భూ యజమానుల ప్రశాంతమైన స్వాధీనాన్ని భంగం కలిగించేందుకు ప్ర యత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేసి, నకిలీ పత్రాల తయారీ, అక్రమ రిజి స్ట్రేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు లో వెలుగులోకి తీసుకు రానున్నట్లు జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా నకిలీ పత్రాల సృష్టించడంలో సహకరించిన డాక్యుమెంట్ రైటర్ల పాత్ర ను పరిశోధిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో జైనథ్ పోలీసులు చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నారు.

## మంత్రి జూపల్లికి కలెక్టర్ ఘన స్వాగతం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 6 ,( ప్రజాజ్యోతి ).**వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం బాసరకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఘన స్వాగతం పలికారు. బాసర రాజన్న అతిథి గృహంలో మంత్రికి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.అనంతరం పోలీసు అధికారులు మంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చలో కరీంనగర్ రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన కార్మికులు




**సోనాల, సెప్టెంబర్ 06 ( ప్రజాజ్యోతి ):** ఏఐటియుసి సోనాల మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సభ్యులు కొండమడుగు శంకర్, బర్కుంటి చిన్నయ్య, అంగునూరి ఆశన్న, పడిగల విట్టల్ , చెట్లపల్లి లక్ష్మణ్, పడాల రామ్మూర్తి, ఇతర కార్మికులంతా కలిసి కరీంనగర్ వెళ్లడం జరిగింది.

## శిశుమందిర్ విద్యార్థులతో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న అశ్విన్ రెడ్డి



**నేరడిగొండ, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ మందిరం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆదిలాబాద్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఏలేటి అశ్విన్ రెడ్డి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ఆకట్టుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల బృందం, నాయకులు, కాలనీవాసులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓబీసీ విభాగానికి కొత్త కమిటీల కసరత్తు

## జిల్లా, మండల కమిటీలకు భారీగా దరఖాస్తులు.. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి): ఆసిఫాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగాన్ని జిల్లాలో మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా, మండల స్థాయి ఓబీసీ కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఓబీసీ విభాగం జిల్లా అబ్జర్వర్ ముత్తినేని రవీందర్ హాజరై ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓబీసీ వర్గాల్లో పార్టీకి ఉన్న ఆదరణను మరింత పెంచడంతో పాటు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలనే ఉద్దేశంతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఓబీసీ వర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించేందుకు ఈ కమిటీలు కీలక వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.





**క్షేత్రస్థాయిలో బలోపేతమే లక్ష్యం**

ఈ సందర్భంగా ఓబీసీ విభాగం జిల్లా అబ్జర్వర్ ముత్తినేని రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఓబీసీ విభాగం ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉందన్నారు. జిల్లా, మండల కమిటీల్లో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. కేవలం పదవుల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని అన్నారు. ఓబీసీ వర్గాల సమస్యలను గ్రామస్థాయిలో గుర్తించి, వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారం కోసం కృషి చేసే విధంగా కమిటీలు పనిచేయాలని సూచించారు.

**ఓబీసీ హక్కుల కోసం ముందుకు రావాలి**

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఓబీసీ వర్గాల సమస్యలు, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా, మండల స్థాయి ఓబీసీ విభాగం పదవులకు అర్హత, అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కమిటీల ఎంపిక ప్రక్రియను పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు మరింత బాధ్యత**

కొత్తగా ఏర్పడే ఓబీసీ కమిటీలపై అనేక బాధ్యతలు ఉండనున్నాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఓబీసీ వర్గాల్లోని ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాల్లో కమిటీ సభ్యులు చురుగ్గా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామాలు, మండలాల్లో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంలో కొత్త కమిటీలు కీలకంగా పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు.

**ఆశావహుల్లో ఉత్సాహం**

జిల్లా, మండల స్థాయి పదవులకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంతో ఓబీసీ విభాగం ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. తమకు అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పలువురు ఆశావహులు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ నాయకులు, ఓబీసీ విభాగం ఆశావహులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొత్త కమిటీల ఏర్పాటుతో జిల్లాలో కాంగ్రెస్ ఓబీసీ విభాగానికి మరింత చురుకుదనం రానుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి.జర్నలిస్ట్ కృష్ణపల్లిసూరి!.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలి

### ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్

### కాంగ్రెస్ ప్రజా పాలనలో వెయ్యిరోజుల ప్రగతి

### నాటి బీఆర్ఎస్ వైఫల్యాలపై కాంగ్రెస్ మహా ధర్నా

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి )** ప్రతిపక్ష నేతగా విఫలమైన బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ తొలి తెలంగాణ ము ఖ్య మంత్రి కల్వ కుంట్ల చంద్ర శేఖర్ రావు (కెసిఆర్) వెంటనే పదవికి రాజీనామా చేయాలని ఆదిలాబాద్ డి సిసి అధ్యక్షుడు డాక్టర్ నరే ష్ జాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో ఆది లాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా నరేష్ జాదవ్ మాట్లాడుతూఅ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి, ప్రజా సంక్షేమ మేలక్ష్యంగా తెలంగాణలో ప్రజాపాలన అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామ ని తెలిపారు.తెలంగాణ ఏ ర్పాటు కోసం సోనియా గాంధీ చేసిన కృషి చారిత్రాత్మకం నలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పా టు చేయడంలో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించా రని డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏ ర్పాటు సమయంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పార్లమెంట్‌లో చట్టం చేసి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలను అందులో పొందుపరిచా రని గుర్తు చేశారు.అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలన లో ఆ చట్టంలోని హామీల అమలు పై తగిన శ్రద్ధ చూపకుండా,నీళ్లు--నిధులు--నియామకాలు, సామాజి క న్యాయం వంటి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కన పెట్టి కుటుంబ పాలనకు ప్రా ధాన్యత ఇచ్చిందని విమర్శించారు.రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం భారీగా అప్పుల్లోకి నెట్టిందని డాక్టర్ నరేష్ జాదవ్ ఆరోపించారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం మిగిల్చారని అన్నారు.రైతుల సంక్షేమం గురించి ఇప్పుడు మాట్లా డుతున్న బీఆర్ఎస్ నాయకులు, తమ పదేళ్ల పాలన లో రైతులకు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా, రైతు రుణమాఫీ విషయంలో నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌కు బుద్ధి



చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శ లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. గత పాలనపై ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని, అందుకే బీఆర్ఎస్ నాయకత్వం అధికారానికి దూరమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ అంటే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కాంగ్రెస్ అంటే ప్రజల ప్రభుత్వం అని ఆయన అన్నారు.రాబోయే రోజుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని డాక్టర్ నరేష్ జాదవ్ తెలిపారు.

# బాసరలో రూ.354 కోట్లతో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం
మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 6 ,( ప్రజాజ్యోతి ).**తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24





గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు.భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పుణ్యస్నానాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధితో పాటు భద్రతా చర్యలను పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. పుష్కరాల కోసం చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# శబరి అమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## -ఆడే గజేందర్

**బోథ్, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** మండలంలోని కనుగుట్ట గ్రామంలో శబరిమాత ఆశ్రమంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించిన అఖండ జ్యోతి కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డీ భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ గోకా గణేష్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శబరిమాత ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శబరిమాత ఆశ్రమం వద్ద ఆడే గజేందర్ అందించిన రూ.5 లక్షల నిధులతో నిర్మించిన నూతన షెడ్‌ను ప్రారంభించారు. భక్తులకు, ఆశ్రమానికి ఈ షెడ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ.. శబరిమాత భక్తి, విశ్వాసం, సహనం, త్యాగానికి ప్రతీక అని అన్నారు. శ్రీరాముడి కోసం ఎన్నో సంవత్సరాలు ఎదురుచూసి, అపారమైన భక్తితో స్వామివారిని సేవించిన శబరిమాత జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.శబరిమాత ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. శ్రావణ మాసంలో అఖండ జ్యోతి వెలిగించడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని, ఆ జ్యోతి వెలుగు ప్రతి ఇంటా నిండాలని, ప్రతి కుటుంబంపై శబరిమాత కరుణాకటాక్షాలు ఉండాలని కోరుకున్నారు. శబరిమాత ఆశ్రమం మరింత అభివృద్ధి చెంది, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకుల అనిత రాజేందర్ బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి చంటి, బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి పోశెట్టి, కార్యదర్శి వినయ్, జిల్లా ఉప సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు అరుణ్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి, బోథ్ మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, బోథ్ మండల అధ్యక్షులు భోజన్న,



సోనాల మండల అధ్యక్షులు గాజుల పోతన్న, నక్కలవాడ సర్పంచ్ నవీన్, మర్లపెల్లి ఉప సర్పంచ్ రమేష్,తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు రెడ్డి, అచ్యుత్ రెడ్డి, దినేష్, నాయుడి రవి,బుచన్న, రవి, శంషుద్దీన్, ఆశన్న, భోజన్న, రాములు, రమేష్, ఎల్లయ్య, రాజేందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉట్టి కొట్టే పోటీలో పాల్గొన్న టీం లకు బహుమతులు

## 5వేల నగదు మెమంటోల అందజేత

**ఖానాపూర్ సెప్టెంబర్ 6( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ఉట్టికొట్టే పోటీల్లో బహుమతులు నగదుతో పాటు మెమొంటోలను అందజేశారు ఖానాపూర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ , మొదటి బహుమతి 5వేలు విజేత టీం పద్మావతి నగర్ యూత్ కు రెండో బహుమతి అంక మౌనిక మున్సిపల్ చైర్మన్ 2వెల 500 విద్యానగర్ శివశక్తి యూత్ తృతీయ బహుమతి 1500 కౌన్సిలర్ బొప్పరపు సత్యవతి, ఏకలవ్య యూత్ 1వెయ్యి నగదు బహుమతి లు సొంతంగా అందించారు ఈ కార్యక్రమంలో నిమ్మల రమేష్ కౌన్సిలర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ రమేష్ ,గౌరికార్ రాజు,మహాజన్ జితేందర్ , చింతామణిశ్రీనివాస క్రిష్ణస్వామి ,సింగు లక్ష్మీనారాయణ,కావాలి సంతోష్ ,సందుపట్ల శ్రావణ్,కశావేని ప్రణయ పడాల రాజశేఖర్ ,గట్టు రాజేశ్వర్ ,రాజు రాపెల్లి రాజు యాదవ్ ,గాడ్పు రాజ భూషణ్ లు ఈ పోటీలను రేపరీలుగా



సజావుగా నడిపించారు ,ఈ కార్యక్రమానికి వివిధ గణేష్ మండలిల సభ్యులు యువత తో పాటు 12 టీం లు ఉట్టి కార్యక్రమములో పాల్గొనడం జరిగినది కార్యక్రమములో అధ్యక్షులు మంత్ర రాజం సురేష్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు విడిసి అధ్యక్షులు బిసి రాజన్న చింతామణి శ్రీనివాస కృష్ణ మహాజన్ జితేందర్ కాశి వేణి ప్రణయ్ శ్రవణ్ సంతోష్ పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# కుప్టి బ్రిడ్జిపై మృత్యుకుహరం.. మూడో రోజూ అదే నరకం!



బ్రేక్‌ఫెయిల్‌తో ఐదు లారీలు ఢీ.. నుజ్జునుజ్జైన క్యాబిన్లు

ఒకే మార్గంలో వేలాది వాహనాలు.. గంటల తరబడి ట్రాఫిక్ జామ్

అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకునే దుస్థితి

**నేరడిగొండ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):** నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఎన్‌హెచ్--44 కుప్టి బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. బ్రిడ్జి స్లాబ్ దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు తేలడంతో పాటు భారీ రంధ్రం ఏర్పడి పక్షం రోజులు గడుస్తున్నా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ప్రాంతంలో కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా కేవలం డ్రమ్ములు ఏర్పాటు చేసి ఒకవైపు రాకపోకలను నిలిపివేయడంతో ఇరువైపుల నుంచి వచ్చే వాహనాలను ఒకే మార్గంలోకి మళ్లిస్తున్నారు.

**వరుసగా మూడు రోజులు.. ప్రమాదాల పరంపర**

కుప్టి బ్రిడ్జి వద్ద వన్‌వే డైవర్షన్ కారణంగా వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం అర్ధరాత్రి డైమండ్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. ఈ ఘటన మరువకముందే శుక్రవారం అర్ధరాత్రి టమాటా లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో రెండు లారీలు రోడ్డు పక్కనున్న గుంతల్లోకి బోల్తాపడ్డాయి. టమాటా లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో హైవేపై రాకపోకలు స్తంభించి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**మూడో రోజు.. ఐదు లారీలు ఢీ**

ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుప్టి బ్రిడ్జి సమీపంలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భారీ లారీ బ్రేక్‌ఫెయిల్ కావడంతో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. వెనుక నుంచి వస్తున్న మరో మూడు లారీలు సైతం అదుపుతప్పి వరుసగా ఢీకొన్నాయి. దీంతో మొత్తం ఐదు లారీలు ప్రమాదానికి గురై క్యాబిన్లు నుజ్జునుజ్జ య్యాయి. పలువురు డ్రైవర్లు, క్లీనర్లు గాయపడినట్లు సమాచారం. ఈ ప్రమాదంతో మరోసారి హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**ట్రాఫిక్‌లో అంబులెన్స్.. అత్యవసర సేవలకు ఆటంకం**

కుప్టి బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ తీవ్రతకు అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర సేవల వాహనాలు కూడా ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఆలస్యమైతే ప్రాణనష్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

**ఒకే మార్గంలో వేలాది వాహనాలు**

బ్రిడ్జి ఒకవైపు మార్గాన్ని మూసివేయడంతో ఇరువైపుల నుంచి వచ్చే వాహనాలన్నింటినీ ఒకే మార్గంలో నడుపుతున్నారు. భారీ కంటైనర్లు, సిమెంట్, ఇనుము, ఇతర సరుకులతో వెళ్లే లారీలు ఒకేసారి బ్రిడ్జిపై బారులు తీరుతున్నాయి. ఇప్పటికే దెబ్బతిన్న బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో నిర్మాణంపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న మరోవైపు మార్గానికి కూడా నష్టం వాటిల్లితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**ఘాట్ స్లోప్‌తో బ్రేక్‌ఫెయిల్ భయం**

కుప్టి ఘాట్ సమీపంలో రహదారి సుమారు కిలోమీటర్ మేర స్లోప్‌గా ఉండటంతో భారీ లోడ్లతో వెళ్లే లారీలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్‌లో లారీలు నెమ్మదిగా కదలడం, భారీ లోడ్లతో దిగువకు వెళ్లే సమయంలో బ్రేక్‌లపై అధిక ఒత్తిడి పడే అవకాశం ఉండటంతో బ్రేక్‌ఫెయిల్ ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్**

కుప్టి బ్రిడ్జి వద్ద వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై వాహనదారులు, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రాణం బలికాకముందే దెబ్బతిన్న బ్రిడ్జి మార్గానికి వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని, ట్రాఫిక్ నియంత్రణకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నేరడిగొండ, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి )**తెలంగాణ అసెంబ్లీ సమావే శాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆదివారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే సీ ఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి లో జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఉన్నారు.

## గురుకుల ప్రిన్సిపాల్ కుఎక్సలెన్స్ ఎడ్యుకేషన్ అవార్డు






**బోథ్, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** విద్యను ఉద్యోగానికి మార్గంగా మాత్రమే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుస్తూ అంకితభావంతో సేవలందిస్తున్న బోథ్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగీతకు ప్రతిష్ఠాత్మక "ఎక్సలెన్స్ లీడర్‌షిప్ ఇన్ ఎడ్యుకేషన్" అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని సంగీత అందుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలలోనే ప్రిన్సిపాల్ పని చేస్తున్న ఈ సమయములో అవార్డు రావడం,ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.. ఉపాధ్యాయురాలిగా తన ప్రస్థానంలో విద్యార్థుల చదువుతో పాటు వారి క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, ప్రతిభా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ అందించడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రిన్సిపాల్‌గా పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంలో తనదైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. 'ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగలదు' అన్న నమ్మకంతో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సంగీత సేవలను గుర్తించిన హరి యూనివర్సిటీ ఈ పురస్కారంతో సత్కరించింది. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు..

# బాసరలో జూపల్లి పర్యటన 324 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఏడాది ముందుగానే పుష్కర ఏర్పాట్లకు శ్రీకారం రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి: మంత్రి జూపల్లి**

**బాసర, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం బాసరలో పర్యటించిన ఆయన రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారి సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీసు, రెవె న్యూ, దేవాదాయ, వైద్య, పురపాలక తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు..





**1,000 కోట్లతో అభివృద్ధి పనులు**

ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను ఏడాది ముందుగానే ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు.బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పుణ్యస్నానాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధితో పాటు భద్రతా చర్యలను పటిష్ఠం చేయనున్నట్లు చెప్పారు. పనులను నిర్దేశిత గడువులోగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత, పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు.పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మంత్రికి వివరించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి మార్చ్‌ను విజయవంతం చేయాలి

**16న ఉట్నూర్ ఐటీడీఏ ముందు భారీ నిరసన**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తుడుం దెబ్బ, రాయి సెంటర్ తీర్మానం**

**ఉట్నూర్, సెప్టెంబర్ 6,(ప్రజా జ్యోతి)**ఆదివాసుల అస్తిత్వ పరిరక్ష ణ, యువతీ, యువకుల, ఉద్యోగాలు, షెడ్యూల్డ్ ప్రాంతాల హక్కుల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 16న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహించే ఆది వాసి మార్చ్‌ను విజయవం తం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాయి సెంటర్ పిలుపు నిచ్చాయి. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసి భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తుడుం దెబ్బ మండల, జిల్లా, డివిజన్ కమిటీల ప్రతినిధులు, కందువాళ్ల పంచాయతీ రాజ్ సెంటర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ ఆదివాసుల అస్తిత్వాన్ని కాపాడుకోవడంతో పాటు ఆదివా సీ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు, షెడ్యూల్డ్ ప్రాంతా ల పరిరక్షణ, రాజ్యాంగ బద్ధమైన ఆదివాసీ హక్కుల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు నిధులు నియామకాలు ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి, ఆదివాసీ యువత భవిష్య త్తుకు న్యాయబద్ధంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 16న ఉట్నూ ర్ ఐటీడీఏ ముందు నిర్వహించే భారీ ఆదివాసి మార్చ్, నిరసన కార్యక్రమానికి మండలాల నుంచి, గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజలు, యువతీ యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్య లో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్ర మంలో పూర్క బాపూరావు తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,ఉయిక సుదర్శన్ తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్య క్షులు, కుడ్మేత తిరుపతి తుడుందెబ్బ రాష్ట్ర కార్యద ర్శి, పివిటిజి రాష్ట్ర అధ్యక్షులు,కోవా విజేయ్ కూమర్ తుడుందెబ్బ కుంరంభీం జిల్లా అధ్యక్షులు, పెందోర్ దాదిరావు తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, తొడసాం సుమన్ ఉట్నూర్ కొత్తగూడ సర్పంచ్ పెందోర్ సంతోష్ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, మాడవి మధు రజ్ ఆదివాసీ విద్యార్థి సంఘం కుంరం భీం జిల్లా అధ్యక్షులు, నైతం రమేష్ తుడుందెబ్బ జిల్లా కార్యనిర్వా హణ అధ్యక్షులు, కనక గణేష్ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులు, ఆత్రం మనోహార్ మహాగం సార్మేడి, గెడం గణపతి మార్లు వాహిని సార్మే డి,ఆత్రం ఆనంద్ రావ్ కోయపున్నేం జాతీయ కార్య దర్శి,మెస్రం నాగోరావ్ రిటర్డ్ ఉద్యోగి, కాత్లే రమేష్ రిటర్డ్ ఏఎస్ఐ,కుడ్మేత సుధాకర్ ఎంఈఓ, పూర్క చిత్రుతు దుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి,పెందోర్ మారుతీ కొమరంబిం జిల్లా ప్రధాన కార్యదర్శి, అరె బీమన్న నా యకపోడు జిల్లా ప్రధాన కార్యదర్శి,మాడవి కోసేరావు ఇంద్రవెల్లి అధ్యక్షులు,ఆడ శ్రీ రామ్ నార్నూర్ మండల అధ్యక్షులు, కాత్లే బుచ్చన్న తోటి సేవ సంఘం జిల్లా నాయ కుడు,కుంర చందు జైనూర్ మండల అధ్యక్షులు, మడా విసాగర్ నార్నూర్ ప్రధాన కార్యదర్శి, మెస్రం మోతీరాం నార్నూర్ కార్యనిర్వహణ అధ్యక్షులు, పంద్ర సురేష్ తుడుందెబ్బ వాంకిడి మండల అధ్యక్షులు, సర్పంచ్,రాయి సిడం హరీష్ నార్నూర్ మం దల ఏఎస్ యు అధ్యక్షులు, ఆత్రం రమేష్ నార్నూర్ ఆదివాసీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# విద్య,వైద్య ఉపాధి హక్కుల కోసం సమరశిల పోరాటాల కు సిద్ధం కండి

### మేస్రం భాస్కర్ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర 3 వ మహా సభల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ




**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి ):** రాజ్యాంగం కల్పించినవిద్య, వైద్యం, ఉపాధి హక్కులకై యువత సమరసిల పోరాటాలకు సిద్ధం కావాలని ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేస్రం భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో యాదగిరి గుట్టలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 3 మహాసభల విజయ వంతానికై ప్రచార ఉద్యమం లో భాగంగా మహాసభల వాల్ పోస్టర్లను, ఉట్నూర్ మండలకేంద్ర లో గిరిజన బాలుర కళాశాల వసతి గృహ వద్ద ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మేస్రం భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వవిద్యా వ్యవస్థను బలోపేతంచేయాలని, విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆసు పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి, పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలని అన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని,నిరుద్యోగ సమస్యను పరిష్కరిం చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. యువజన వ్యతిరేక విధానాలపై యువత సమ స్యలపై నిరంతరం సమరం సాగిస్తామని అన్నారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఏఐవైఎఫ్ 3 రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, రమేష్ , శేఖరు, ప్రదీప్, పవన్, ప్రకాష్, సునీల్, శివ, ఆనంద్, మిథున్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ పాత తాలూకా అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలి

### నేటి నుండి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు

### ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను కోరుతున్న ప్రజలు




**ఖానాపూర్ సెప్టెంబర్ 6( ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ గిరిజన రిజర్వుడు నియోజకవర్గంలోని ఖానాపూర్ పాత తాలూకా లోని ప్రస్తుత ఖానాపూర్, పెంబి,కడం, దస్తురాబాద్,మండలాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆదివాసి పోరు బిడ్డ వెడమ బొజ్జు పటేల్ శాశ్వత అభివృద్ధి పట్ల చర్చించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గత అనేక దశాబ్దాలుగా ఈ గిరిజన నియోజకవర్గంలో ఎందరో ఎమ్మెల్యేలు ఆధిపత్యం వివిధ పార్టీలు ప్రభుత్వాల్లో ప్రాతినిధ్యం వహించిన అప్పటి ఖానాపూర్ పాత తాలూకా అభివృద్ధికి నోచుకోక అలమటిస్తూనే ఉంది పేరుకు ఖానాపూర్ నియోజకవర్గమైన ఈ ప్రాంతంలో ఇప్పటికీ శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి కార్యక్రమాలు అంచుకు కూడా జరగలేదు అని ప్రజలు విమర్శిస్తున్నారు కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలిటెక్నిక్ లకు నోచుకోలేదు 30 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ఆదివాసి అనుభవశాలి స్వర్గీయ కొట్నాక్ భీమ్రావు గిరిజన మంత్రి హయంలో అప్పటి స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఖానాపూర్ పాత తాలూకా సస్యశ్యామలంగా రెండు పంటలు పండించే ఖానాపూర్ మండలంలోని మేడమ్ పెల్లి గ్రామ పంచాయతీలో గల సదర్ స్మార్ట్ కాల్వను చీటికీ మాటికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పై ఆధారపడకుండా రెండు పంటలకు నీరు సమృద్ధిగా అందించేందుకు బ్యారేజీ వందల కోట్లతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు ఈ మేరకు సర్వేన సైతం పూర్తి చేయించారు ఈ హామీని గడిచిన పదేళ్ల బి ఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రి నిర్మిస్తామని ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు అయితే కాంట్రాక్ట్ కమిషన్లకు అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు ఖానాపూర్ పాత తాలూకా ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించి పక్క నియోజకవర్గం నిర్మల్ అభివృద్ధి చేసుకునేందుకు అక్కడి నాయకులు చేసిన కుట్రలో బ్యారేజీ నిర్మాణం ఇక్కడ జరగకుండా అక్కడి మామడ మండలం పొన్కల్ ప్రాంతంలో బ్యారేజ్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి నిర్మాణం పూర్తి కాకుండా వదిలేసిన క్రమంలో మళ్లీ ఈ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలోనే పూర్తి చేసి ప్రారంభించారు అయితే ఈ ప్రాంతం నుంచి అక్కడికి తరలించిన క్రమంలో ఈ ప్రాంత ఖానాపూర్ పాత తాలూకా రైతాంగానికి ఇబ్బందులు కలగకుండా ఏడు కిలోమీటర్ల ప్రత్యేక కెనాల్ నిర్మిస్తామని అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి మోసం చేశారన్న ప్రజల విజ్ఞప్తులు స్వీకరించిన ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు ఈ మేరకు 7కిలోమీటర్ల ప్రత్యేక కెనాల్ ను పొనకల్ బ్యారేజీ నుండి ఖానాపూర్ పాత తాలూకా రైతాంగానికి నేరుగా నీరు చేరేందుకు నిర్మింప చేయడానికి అసెంబ్లీలో చర్చించి నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు అలాగే ఇటీవల హామీ ఇచ్చిన ఆయిల్ ఫామ్ ఇండస్ట్రీ తో పాటు ఖానాపూర్ పాత తాలూకాలో ఏ మండల కేంద్రంలోనైనా శాశ్వత ప్రతిపాదికన యువతకు మేలు కలిగే విధంగా పరిశ్రమ ఏర్పాటు చేయాలని అన్నారు

**నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీ**

**ఖానాపూర్ పట్టణానికినిధులు**

ఖానాపూర్ నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీగా ఏర్పడ్డ ఖానాపూర్ పట్టణానికి అత్యధిక నిధులు కేటాయింపజేసి అభివృద్ధి చేయాలని ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించాలని బొజ్జు పటేల్ ఎమ్మెల్యేను స్థానికులు కోరుతున్నారు ముఖ్యంగా పట్టణంలో రోడ్డు వైడనింగ్ తీవ్ర సమస్యగా మారి అనేక ఇబ్బందులకు ప్రమాదాలకు గురిచేస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రికి సంబంధిత మంత్రులకు వివరించి సరిపడ నిధులు మంజూరు చేయించి రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని ఖానాపూర్ పట్టణంలో మధ్యలో ఆగిపోయిన రోడ్డు వేయడానికి పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

## రైతులకు దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదు

**ఆదిలాబాద్ ఎంపీ జీ నగేష్**




**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి )** అధికారంలో వచ్చాక ఏదేదో చేస్తామని రైతులకు హామీలు ఇచ్చిన అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీరా అధికారంలోకి రాగానే రైతుల భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తూ అనేక మోస పూరిత కార్యక్రమాలు చే స్తుందని ఆదిలాబాద్ పార్ల మెంట్ సభ్యులు జీ .నగేష్ అన్నారు. ఆదివారం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు అసెం బ్లీలో ప్రతిపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇలాగే ప్రజలను మోసం చేస్తే వారికి శిక్ష పడ్డదని, ఇ ప్పుడు అదేగతి కాంగ్రెస్‌కు పడుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ ఎస్‌లకు తెలంగాణ నుంచి బహిష్కరణ చేయడం కచ్చితంగా జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 22ఎ పేరుతో రైతులను మో సం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఉప నేత మహేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు, బిజెపి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు,రాష్ట్ర నాయకులు జిల్లా నాయ కులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లా బిజెపి పార్టీ ఓబిసి మోర్చా జిల్లాకార్యదర్శిగా మీట్కరే రాజేశ్వర్



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి** ఆదిలాబాద్ జిల్లా బిజెపి పార్టీ ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శిగా మిటికరే రాజేశ్వర్ నియామకమయ్యారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా ఓబీసీ కార్యదర్శిగా నియమక పత్రాన్ని పార్ల మెంట్ సభ్యులు జి.న గేష్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ ముస్తాపురై, బిజెపి జిల్లా అధ్యక్షులు, బ్రహ్మానందం,జిల్లా ఓబీసీ అధ్యక్షులు సంతోష్, రాష్ట్ర కమిటీ మెంబర్ తాటి పెల్లి రాజు ఆలియాస్ గంగాధర్ రావు, రైల్వే బోర్డు మా జీ సబ్యులు రమణ చేతుల మీదుగా బిజెపి జిల్లా పార్టీ ఓబిసి మోర్చా కార్యదర్శిగా మీటికరే రాజేశ్వర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విట్కరే రాజేశ్వర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా పదవి అప్పగించిన ఎంపీ ఎమ్మెల్యే రా రాష్ట్రస్థాయి నాయకులకు జిల్లా అధ్య క్షులకు బిజెపి జిల్లా స్థాయి నాయకులకు అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి పార్టీ కోసం గ్రామస్థాయి నుంచి పార్టీ ఓ బి సి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి బి జె పి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని పలు మండలాల బిజెపి అధ్యక్షులు కన్వీనర్లు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రాజేశ్వర్ సోనాల మండలంలోని కోట కె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీగా సర్పంచ్ గ రాజకీయంలో సుమారు 30 సంవత్సరాల అనుభవం ఉన్న వ్యక్తి ఎంపీ నగేష్ కు నమ్మిన బంటుగా పార్టీ విధేయతకు కట్టుబడి ఉండడంతో ఆయనకు బిజెపి పార్టీ ఓబిసి మోర్చా కార్యదర్శిగా నియమించడం జరిగింది

# పచ్చదనం పెంచితేనే భావితరాలకు ఆరోగ్యకర మైన భవిష్యత్

## బంగారు గూడ మైనారిటీ గురుకులంలో ఘనంగా వన మహోత్సవం

## మొక్కలను నాటి.. సంరక్షించే బాధ్యత విద్యార్థులదే జిల్లా కలెక్టర్ రాజర్షిషా








**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి )** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బంగారు గూడ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ప్ర త్యేక వనమహోత్సవ కార్య క్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు వర్షపాతం పెర గడానికి, భూగర్భ జలమ ట్టాలు పెరగడానికి దోహద పడతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ ఇల్లు, పాఠశాల ఆవరణలో కనీసం ఒక్క మొక్కనై నా నాటి, అది మహావృక్షంగా ఎదిగే వరకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని పిలుపునిచ్చారు.గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన వి ద్యతో పాటు ఆహ్లాదకర మైన, పచ్చని వాతావరణాన్ని కల్పించేందుకు అవసర మైన చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బో ర్డును కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులకు నూతన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలను అడ్డుకున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

**మాజీ మంత్రి జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6,(ప్రజా జ్యోతి)** పంటలు నష్టపోయి ప్రాం తాలను సందర్శించడానికి వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు పర్యటనను సీసీఐ భూములకే ఎందుకు మలపాల్సి వచ్చింది ఎమ్మెల్యే పాయల శంకర్ కదా.. అని...ప్రతి కుటుంబానికి అండగా నిలిచే పెన్షన్లు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, తులం బంగారం, రూ.500 గ్యాస్ వంటి పథకాలను ప్రజలకు అందకుం డా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును నిలిపివేసి పైశాచిక ఆనందంతో ఉత్సవాలు నిర్వహిస్తున్న ట్లుగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జోగు రామన్న విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్ప కుండా బుద్ధి చెబుతారని అన్నారు కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, 420 హామీలు,ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ ఆదివారం బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పరిశ్రమల భద్రతతో పాటు సీసీఐ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్నరిలే నిరాహార దీక్షకు జోగు రామన్న సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా పిట్టలవాడ, ధోబీ కాలనీకి చెందిన యువకులు, మహిళలు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. దీక్షల్లో పాల్గొన్న వారికి జోగు రామన్న అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరి కారణంగా ప్రభుత్వ విధానాలు ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుతున్నాయని ఆరోపించారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించే అంశంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ ఆపర్యట నను సీసీఐ భూముల పరిశీలన వైపు మళ్లించారని ఆరోపించారు. రైతుల పంట నష్ట పరిహారం విషయంలో మంత్రిని నిలదీయాల్సిన ఎమ్మెల్యే సీసీఐ భూముల పరిశీలనకు పర్యటనను తీసుకెళ్లడం ద్వారా పరిశ్రమల భూముల విక్రయానికి తొలి అడుగు అక్కడే వేశారని జోగు రామ5న్న విమర్శించారు. రైతుల పక్షాన ఎమ్మెల్యే పాయల శంకర్ పాదయాత్ర చేస్తారో లేదో తెలియదని, అయితే సీసీఐ పునఃప్రారంభం కోసం, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను ఎదుర్కొ నేందుకు తన ఆధ్వర్యంలో దీక్ష మాత్రం పక్కాగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.సీసీఐ నిపునఃప్రారంభించాలనిడిమాండ్ చేస్తూ గ్రామ గ్రామా న సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామ గ్రామాన కరపత్ర ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించుకునే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని జోగు రామన్న స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దర్శనాల మల్లేష్, లంక రాఘవులు, ఇజ్జగిరి నారాయణ, కొండ రమేష్, లోకారి పోశెట్టి, వెంకట్ రమణ, బొల్లు ఈశ్వర్ దాస్, అలాల్ అజయ్, దాసరి రమేష్, కరుణ, మెట్టు ప్రసాద్, దివిటి రాజు, దమ్మపాల్, అశోక్ స్వామి, వెంకటేష్, కొండ గణేష్, బట్టు సతీష్, స్వరూప రాణి, బొడగం మమత తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తీజ్ ఉత్సవాలు



**బోథ్, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** మండలంలోని శిఖర్ కైలాష్ టేకిడిలో గోశాల వద్ద సంత్ లింబాజీ మహారాజ్ ఆధ్వ ర్యంలో తీజ్ సంబరాలు ఘనంగా ముగిసినట్లుగా మహారాజ్ పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పచ్చని అడవుల మధ్య ఉన్న కైలాస శివాలయం వద్ద ఆట పాటలతో ఆనందంగా ఆకాశమే హద్దుగా ఉత్సవాన్ని నిర్వహించారు. తీజ్ బుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లింభాజీ మహారాజ్ మాట్లాడుతూ పూజలతో కుటుంబాలలోసుఖ సంతోషాలు నిండి కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు.ఆమహాదేవుని కృప మీపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

# సోనాలలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ కమిటీ ఎన్నిక



**సోనాల, సెప్టెంబర్ 06 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని ఉషోదయ పబ్లిక్ స్కూల్లో జరిగిన ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో నియమితులైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి గౌరవ అధ్యక్షులు తొడషం బందు, ఉపాధ్యక్షులు సిడం మహేష్, అధ్యక్షులు జుగ్నాక్ మారుతీ, ప్రధాన కార్యదర్శి మెస్రం దత్తు, కార్యదర్శులు కుంరా మాణిక్ రావు, బుర్కే రాందాస్ సంయుక్త కార్యదర్శులు కుంరా జలపతి దుర్గె వేంకట్రావుకోశాధికారి ఆత్రం తులిసి రాంసలహాదారులు ఆత్రం గంగాధర్ కమిటీ సభ్యులు సిడం పురుషోత్తం తొడసాం భీంరావ్ రైసిడం జాకెష్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సిడం నందు మాట్లాడుతు.. లంబాడి వల్ల దాదాపు 50 సంవత్సరాల నుంచి అన్యాయం జరిగింది అన్నారు. వారు ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీలు కాదు అని, తెలంగాణా రాష్ట్రంలో అనేక రాష్ట్రల నుంచి వలస వచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఎస్ టి కాస్ట్ సర్టిఫికెట్ పొంది ఆదివాసుల రిసర్వేషన్ దోచుకుంటున్నారు అన్నారు కావున, దీని వల్ల అసలైన ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అన్నారు. 1950 సంవత్సరం నుంచి స్థానికంగా ఉన్నట్లు నిరూపించాని లంబాడిలకు ఎస్ టి కాస్ట్ సర్టిఫికెట్ జరిచేయారాదని వారు తహసీల్దార్ కు డిమాండ్ చేశారు. ఒక వేళ 1950 సంవత్సరం నుంచి స్థానికంగా ఉండాని లంబాడిలకు ఎస్ టి కాస్ట్ సర్టిఫికెట్లను జారి చేసే తహసీల్దార్ పై న్యాయ పోరాటం చేస్తామని వారు హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమురంభీం జిల్లా అధ్యక్షులు మాడవి మనోహర్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిడం దందు, ఉపాఅధ్యక్షులు తుంరం చందర్శన్, ఏ యు పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం నిల్కంట్ చందపల్లి సార్మేడి కోరేంగా సోనేరావు తొడసాం లక్ష్మణ్ సార్మేడి మెస్రం భూమన్న, ఆత్రం గంగాధర్, తొడసాం మారుతీ, సోయం గుణవంత్ రావు తదితరులు పాల్గొన్నారు

# ఆదిలాబాద్ డైట్ కళాశాలలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి )** స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని డైట్ కళాశాలలో 'స్పె షల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో జరుగుతున్న వివిధ విభాగాల పనితీరును, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మావల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నీ ప్రైమరీ స్కూల్ నిర్మాణ పనుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్, తాసిల్దార్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల నుంచి రూ.50 వేల డిమాండ్

**బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసిన ఇచ్చోడ పోలీసులు**

**పేద విద్యార్థుల సహాయం పేరుతో విరాళాలు సేకరించి, అనంతరం భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్**

**డబ్బులు ఇవ్వకపోతే పాఠ శాల, ఉపాధ్యాయులపై సోషల్ మీడియాలో తప్పుడు, పరువునష్టం కలిగించే వార్తలు ప్రచారం చేస్తానని బెదిరింపులు**

**ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ ఇన్స్పెక్టర్ కేనరేష్ కుమార్**

**ఇచ్చోడ, సెప్టెంబర్ 6,( ప్రజా జ్యోతి )** ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ ఎంజెపి బాలుర పాఠశాలలో పేద విద్యార్థుల సంక్షేమం పేరుతో విరాళాలు సేకరించి, అనంతరం రూ.50,000 /- డిమాండ్ చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచేసిన వ్యక్తిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చే శారు.పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం నర్సాపూర్ మహాత్మా జ్యోతిభా పూలే బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నందా సింగ్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు కోతూరి ప్రవీణ్ ఏకొట్టూరు ప్రవీణ్, రాము నారాయణ, వ యస్సు 35 సంవత్సరాలు, టిజీవిపి విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నట్లు తెలిపారు.నిందితుడు గతంలో పేద విద్యార్థుల సంక్షేమం కోసం విరాళాలు కావాలని పాఠశాలను సందర్శించేవాడు. దీంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు రూ. 5 00 నుంచి రూ.1,000 వరకు విరాళాలు అందించారు. అనంతరం మరోసారి పాఠశాలకు వచ్చిన నిందితుడు రూ.50,000/- ఇవ్వాలని డిమాండ్ చేశాడు.అయితే డబ్బులు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరాకరించడంతో, పాఠశాల, ఉపాధ్యాయుల పై సోషల్ మీడియాలో తప్పుడు, పరువు నష్టం కలిగించే వార్తలు ప్రచారం చేస్తానని బెదిరించి నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రిన్సిపాల్ ను బెదిరిస్తూ ఉద్యోగం కోల్పోయేలా చేస్తానని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఇచ్చోడ పోలీస్ స్టే షన్‌లో క్రైమ్ నంబర్ 438/ 2026, సెక్షన్ 308(5) బి ఎ న్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు కోతూరి ప్రవీణ్ ఏ కొ ట్టూరు ప్రవీణ్ ను అరెస్ట్ చే సినట్లు పోలీసులు తెలిపారు. ఇచ్చోడ ఎస్ ఎచ్ ఓ కె.నరేష్ కుమార్ మాట్లాడు తూ బెదిరింపులు, బ్లాక్ మెయిల్ లేదా డబ్బుల కోసం ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## ఎస్సీల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏదీ?

ప్రత్యేక పంచాయతీ, ఎంపీటీసీ ఏర్పాటు చేయాలి.. లోహజీ



**ఆసిఫాబాద్ సెప్టెంబరు 6 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం లోని బూరుగుడా పంచాయతీ పరిధిలోని ఎస్సీ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రముఖ నాయకుడు వైరాగడే లోహజీ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ ప్రజల అవసరాలకు అనుగుణంగా స్థానిక పరిపాలన సాగాలంటే ప్రత్యేక గ్రామపంచాయతీతోపాటు ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామంలోని ఎస్సీ కుటుంబాలు వైద్యం, విద్య, ఉపాధి, గృహ వసతి, భూమి, తాగునీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని లోహజీ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు వైద్య ఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

ఎస్సీ కుటుంబాలకు మెరుగైన తాగునీరు, గృహ వసతి కల్పించడంతోపాటు భూమిలేని వారికి భూమి కేటాయించాలని లోహజీ కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించి, నిధులు అర్హులైన ప్రజలకు చేరేలా చూడాలని డిమాండ్ చేశారు.

**స్వాభిమాన పరిపాలన అవసరం**

ప్రత్యేక గ్రామపంచాయతీ, ఎంపీటీసీ ఏర్పాటు చేస్తే స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడంతోపాటు అభివృద్ధి నిధులు, సంక్షేమ పథకాలు అర్హులకు చేరే అవకాశం ఉంటుందని లోహజీ అన్నారు. "మాకు ఎవరిపైనా వ్యతిరేకత లేదు. మా హక్కులపై అవగాహన, సమస్యలకు పరిష్కారం, స్వాభిమాన పరిపాలన మాత్రమే కావాలి" అని స్పష్టం చేశారు. సమానత్వం, స్వాభిమానం, రాజకీయ ప్రాతినిధ్యం, సమగ్ర అభివృద్ధి కోసం ఎస్సీ ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా యాదవ సంఘం కృష్ణాష్టమి వేడుకలు



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 6 ,( ప్రజాజ్యోతి ).**పట్టణంలోని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా. ఆలయంలో భక్తులు యాదవ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు తదనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన్ని కార్యక్రమం ఏర్పాటు చేశారు యాదవ సంఘం యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ హిందూ సనాత ధర్మంలో శ్రీకృష్ణుని హిందూ ధర్మంలో అ త్యంత ప్రముఖమైన దైవస్వరూపంగా పూజలు అందుకుంటున్నారు సత్యానికి ధర్మానికి ప్రతీకగా శ్రీకృష్ణుని భక్తులు భావిస్తారు దేవకి వాసుదేవులకు జన్మించిన శ్రీకృష్ణుడు గోకులంలో పెరిగి బాల్యంలోని ఎన్నో అద్భుత ప్రదర్శించాడు మహాభారతంలోని పాండాలకు అండగా నిలిచిన శ్రీకృష్ణుని అర్జుడిని కురుక్షేత్ర యుద్ధ భూమిలో భగవద్గీతను బోధించారు కర్తవ్యాన్ని నిబద్ధత నిర్వహించాలని ధర్మాన్ని కాపాడాలని శ్రీకృష్ణుడు చేసిన సేవలు మానవాళికి విదర్శంగా నిలిచయాన్ని తెలియజేశారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు , జంపెల్లి శ్రీనివాస్ యాదవ్,. ప్రధాన కార్యదర్శి మంచాల ఆనంద్ యాదవ్, కోశాధికారి, గడ్డం నరహరి యాదవ్ సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు

## విమానాశ్రయ భూసేకరణకు నిశాన్‌ఘాట్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల

**డిసెంబర్‌లోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాదు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగ వంతం చేస్తున్నట్లు జిల్లా క లెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు ఇందులో భాగంగా నిశాన్ ఘాట్ గ్రామంలో 428.16 ఎకరాల భూమి సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. నిశాన్‌ఘాట్ గ్రామంలో నోటిఫికేషన్‌కు సంబందించిన నోటీసులు జారీ చేసిన వారం రోజుల అనంతరం గ్రామసభ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాతాదారు పేరు, భూమి విస్తీర్ణం తదితర వివరాల్లో ఏవై నా తేడాలు లేదా వ్యత్యా సాలు ఉంటే సంబంధిత భూయజమానులు భూసేకరణ అధికారికి లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. ఆదిలాబాదు విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా గతంలో టాక్లి, కచికంటి అర్లీ (బి) గ్రామాల్లో భూసేకర ణకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి ఇప్ప టికే సేకరించిన భూమికి అదనంగా, భవిష్యత్ విస్తరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 2,009 ఎకరాల భూమిని సేకరించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.విమానాశ్రయ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, అందుకు అనుగుణంగా అధికారులు సమ న్వయంతో చర్యలు చేపడు తున్నారని కలెక్టర్ స్పష్టంచేశారు.

# అయ్యవా జ్ఞాపకాలే.. మనువడి జీవితానికి వెలుగుబాటలు

## ఆనాటి ఆప్యాయతలు.. నేటి తరానికి విలువైన పాఠాలు

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):** కాలం మారుతోంది.. పల్లె జీవన విధానం మారుతోంది.. మనుషుల ఆలోచనలు మారుతున్నాయి. ఆధునికత పరుగుల్లో కుటుంబ సభ్యులతో గడిపే సమయం కూడా తగ్గిపోతోంది. అయితే ఒకప్పుడు ఇంట్లో పెద్దలు చెప్పిన మాటలు, చూపిన ప్రేమ, నేర్పిన జీవన విలువలు మాత్రం తరాలు మారినా మనసుల్లో చెరిగిపోని జ్ఞాపకాలుగా నిలిచిపోతున్నాయి. అలాంటి మధురమైన అనుబంధానికి ప్రతీకగా నిలుస్తోంది అయ్యవా మనువడి ఆప్యాయత. ఒకప్పుడు పల్లెల్లో నానమ్మ ఒడిలో పెరిగిన పిల్లలకు ఆమె మాటలే మొదటి పాఠశాల. పుస్తకాల్లో లేని ఎన్నో జీవిత సత్యాలను తన అనుభవాలతో చెప్పేది. ఎవరిని ఎలా గౌరవించాలి కష్టాలను ఎలా ఎదుర్కోవాలి.. మనిషిగా ఎలా నిలబడాలి.. మనకు ఉన్నదాంట్లోనే ఎలా సంతోషంగా జీవించాలి.. అనే విషయాలను ప్రేమగా వివరించేది.



### కాలం మారినా.. విలువలు మారకూడదు

మనువడు నేటి తరానికి ప్రతినిధిగా నిలిస్తే.. అయ్యవా ఆనాటి జీవన విలువలకు ప్రతిరూపంగా కనిపిస్తోంది. నేటి సమాజంలో ఎదురవుతున్న మార్పులను చూస్తూ.. రేపటి జీవితంలో ఎలా ముందుకు సాగాలో అయ్యవా తన అనుభవాలను మనువడితో పంచుకుంటున్నట్లుగా ఈ దృశ్యం కనిపిస్తోంది. డబ్బు, హోదా, సాంకేతికత కంటే మంచి మనసు, మానవత్వం, పెద్దల పట్ల గౌరవం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ముఖ్యమని పెద్దలు చెప్పిన మాటలు ఇప్పటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయి.

### జ్ఞాపకాల్లో నిలిచిపోయే ఆప్యాయత

చిన్నప్పుడు అయ్యవా తో కలిసి గడిపిన రోజులు.. ఆమె చేతి వంట రుచి.. నిద్రపుచ్చే సమయంలో చెప్పిన కథలు.. పండుగల సమయంలో చూపిన సందడి.. తప్పు చేస్తే ప్రేమగా మందలించిన తీరు.. బాధలో ఉన్నప్పుడు ధైర్యం చెప్పిన మాటలు.. ఇవన్నీ జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

### అయ్యవా చెప్పిన ప్రతి మాట అప్పట్లో

సాధారణంగా అనిపించినా.. కాలం గడిచేకొద్దీ ఆ మాటల్లోని జీవిత సత్యం అర్థమవుతుంది. అందుకే పెద్దలు దూరమైన తర్వాత కూడా వారి జ్ఞాపకాలు మనతోనే ఉంటాయి.

### ఆనాటి జ్ఞాపకాలు.. నేటి తరానికి సందేశం

నేటి యువత సాంకేతిక ప్రపంచంలో ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ.. కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు, పెద్దల అనుభవాలకు ఉన్న విలువను మరచిపోకూడదనే సందేశాన్ని ఈ ఆప్యాయ దృశ్యం అందిస్తోంది. తరాలు మారవచ్చు.. కాలం మారవచ్చు.. జీవన విధానం మారవచ్చు.. కానీ అయ్యవా చూపిన ప్రేమ, నేర్పిన విలువలు మాత్రం ఎప్పటికీ మారవు. భౌతికంగా నానమ్మ మన మధ్య లేకపోయినా.. ఆమె మాటలు మన చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి. ఆమె చూపిన దారి మన అడుగులకు మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆమె ప్రేమ మనసులో ఓ మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

### అయ్యవా అంటే ఓ బంధం మాత్రమే కాదు.. ఓ జ్ఞాపకం.

అయ్యవా అంటే ఓ మనిషి మాత్రమే కాదు.. ఓ జీవన పాఠం. అయ్యవా అంటే గతానికి గుర్తు మాత్రమే కాదు.. భవిష్యత్తుకు మార్గదర్శకం. ఆమె జ్ఞాపకాలు మనువడి హృదయంలో ఎప్పటికీ చెరిగిపోని మధురానుభూతిగానే నిలిచిపోతాయి.

# తాండూరు మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల సంబరాలు...

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం



**తాండూరు సెప్టెంబర్ 6 ప్రజాజ్యోతి** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తయిన సందర్భంగా తాండూరు ఐ.బి. సెంటర్ లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మరియు ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, అనంతరం కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తాండూరు సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు సన్నీ బాబు జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ వాల్మీకి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రోహిత్ హరీష్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు శివకృష్ణ ప్రవీణ్ బెల్లంపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాకేష్ తాండూర్ ప్రధాన కార్యదర్శి అరుణ్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాదారం 3 సర్పంచ్ రవి మారిశెట్టి శ్రీనివాస్ మాసాడి తిరుపతి భూమయ్య కేశెట్టి సంతోష్ మహేష్ రఫ్,బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాత నాగరాజ్, తాండూర్ గ్రామ ఉపసర్పంచ్ సత్యనారాయణ, మాసాడి తిరుపతి శివకృష్ణ, సేవాదళ్ నాయకులు అయుబ్, నాయకులుకార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు 'ఆచార్య దేవో భవ' అవార్డులు

## సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో గొప్పది

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, 6, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. గద్దెరగాడి వి స్క్వేర్ ఫంక్షన్ హాల్లో ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆచార్య దేవో భవ' అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యను అందించడం మాత్రమే కాకుండా, విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి ఉన్నతమైన లక్షణాలను నేర్పించి వారిని బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి ప్రతిభను ప్రోత్సహించేలా 'ఆచార్య దేవో భవ' అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, జిల్లా అధ్యక్షులు రాపోల్ విష్ణువర్ధన్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదారి చంద్రమోహన్, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు దుర్గ ప్రసాద్, సీనియర్ కరస్పాండెంట్ బాలాజీ, శరత్ కుమార్, శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ గంగవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయూసీ ప్రధాన లక్ష్యం

### యూనియన్ బలోపేతంతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలి

### ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్

### సొంతింటి పథకం, ఇన్‌కమ్ ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ సవరణ, ఉద్యోగ భద్రతపై విస్తృత స్థాయి సమావేశంలో కీలక తీర్మానాలు

**మంచిర్యాల, 6, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు వారి హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం కృషి చేయడమే ఐఎన్‌టీయూసీ ప్రధాన లక్ష్యమని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ అన్నారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణకు నాయకులు, పిట్ కార్యదర్శులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని సాయి లీల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఐఎన్‌టీయూసీ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూపాలపల్లి ఏరియా నుంచి రామగుండం, గోలేటి, బెల్లంపల్లి ఏరియాల వరకు వివిధ గనులు, ఓపెన్‌కాస్ట్‌లు, డిపార్ట్‌మెంట్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, దీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అంశాలపై పిట్ కార్యదర్శులు సమర్పించిన నివేదికలను ప్రధాన ఎజెండాగా తీసుకుని సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాపాడుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేసినప్పుడే యూనియన్‌పై కార్మికుల్లో ఆదరణ, విశ్వాసం పెరుగుతుందని అన్నారు. తద్వారా నాయకులకు గుర్తింపు రావడంతో పాటు యూనియన్ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పిట్ కార్యదర్శి తమ పరిధిలోని గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో బ్రాంచ్, కేంద్ర నాయకత్వం పిట్ కార్యదర్శులకు అండగా నిలిచి అవసరమైన దిశానిర్దేశం చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మికుల చిరకాల స్వప్నమైన సొంతింటి పథకాన్ని అమలు చేయాలని, ఇన్‌కమ్ ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మారుపేరు, విజిలెన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, మెడికల్ బోర్డుకు హాజరైన అభ్యర్థుల్లో 80 శాతం మందికి మెడికల్ ఇన్వాల్యుయేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఎటువంటి షరతులు లేకుండా ఉద్యోగాలు కల్పించాలని, నూతన గనుల కేటాయింపు ప్రక్రియను కొనసాగించాలని, 12వ వేతన ఒప్పందాన్ని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వీడీఏను 50 శాతం నిబంధనకు పరిమితం చేయకుండా రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, 1998 నుంచి పెన్షన్ సవరణ జరగనందున వెంటనే పెన్షన్‌ను సవరించి పెంచాలని, సీపీఆర్ఎంఎస్ మొత్తాన్ని రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2025--26 సింగరేణి ఆర్జిత లాభాలను వెంటనే ప్రకటించడంతో పాటు మెరుగైన ఒప్పందంతో పీఎల్ఆర్ బోనస్‌ను వెంటనే ప్రకటించి చెల్లించాలని కోరారు. అలాగే గనులు, ఓపెన్‌కాస్ట్‌లు, డిపార్ట్‌మెంట్లలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సమావేశం తీర్మానించింది. అన్ని క్యాంటీన్లను ఆధునికీకరించి నాణ్యమైన ఆహారం, వసతి సౌకర్యాలతో పరిశుభ్రమైన హైజీనిక్ వాతావరణంలో ఏర్పాటు చేయాలని, కార్మికులకు నాణ్యమైన లాకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రెస్ట్ హాల్స్‌లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. స్నానపు గదులు, వేడి నీటి సౌకర్యం, టాయిలెట్లలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓపెన్‌కాస్ట్‌లలో జరిగే పదవీ విరమణ కార్యక్రమాలకు హాజరయ్యే కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి కార్మికులకు తగిన సీటింగ్, ఇతర వసతులు కల్పించి గౌరవప్రదంగా నిర్వహించాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు అందిస్తున్న రూ.3,500 జ్ఞాపిక మొత్తాన్ని రూ.5,000కు పెంచాలని, పదవీ విరమణ చేసిన కార్మికులకు, మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు టెర్మినల్ బెనిఫిట్స్‌ను త్వరితగతిన అందించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీఎల్, ఈపీ ఆపరేటర్లు తదితర టెక్నికల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని,



కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, పనిముట్లు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కోరారు. మహిళా ఉద్యోగులకు మెరుగైన వసతి, భద్రతా సౌకర్యాలు కల్పించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉన్నత విద్యార్హతలు కలిగిన కార్మికులకు అంతర్గత ఖాళీల్లో పరీక్షలు నిర్వహించి పదోన్నతులు కల్పించాలని, మైనింగ్, టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి టైంబౌండ్ ప్రమోషన్లు జాప్యం లేకుండా కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓపెన్‌కాస్ట్‌లలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన క్యాడర్ స్కీమ్ అందించాలని కోరారు. కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమం, ఉద్యోగ భద్రతతో పాటు గనుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ప్రతి పిట్ కార్యదర్శి తమ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి కేంద్ర, బ్రాంచ్ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు ఎస్. నరసింహారెడ్డి, పి. ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్రావు, మహిళా విభాగం అధ్యక్షులు శ్రీమతి శేషారత్నం, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, కేంద్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు, బ్రాంచ్ ఉపాధ్యక్షులు, వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓపెన్‌కాస్ట్‌ల పిట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఆచార్య దేవోభవ అవార్డులు

**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆచార్య దేవోభవ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గద్దెరగాడి వి స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి 'ఆచార్య దేవోభవ' అవార్డులను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలను నేర్పించడంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో



జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 140 మంది కరస్పాండెంట్లు, 140 మంది ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు. విద్యారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ పలువురు విద్యావేత్తలు, పాఠశాలల నిర్వాహకులు, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి



శేఖర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, కోశాధికారి పెంచాల శ్రీధర్, జిల్లా మాజీ అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య, రాష్ట్ర నాయకులు కస్తూరి పద్మచరణ్, బాలాజీ, సురభి శరత్‌కుమార్, గోపతి సత్తయ్య, రాం వేణుతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాల కోసం హెచ్ఎంఎస్ కీలక చొరవ

## ఆరోగ్య పోర్టల్, అమృత్ ఫార్మసీ సౌకర్యాలపై డబ్ల్యూసీఎల్ సీఎండీ సానుకూల స్పందన



**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్)లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ప్రయోజనాల కోసం కోల్ శ్రామిక్ సభ (హెచ్ఎంఎస్) కీలక చొరవ తీసుకుంది. విశ్రాంత ఉద్యోగులకు వైద్య సౌకర్యాలను మరింత సులభతరం చేయాలని కోరుతూ హెచ్ఎంఎస్ కేంద్ర అధ్యక్షులు, జేబీసీసీఐ సభ్యులు శివకుమార్ యాదవ్ సెప్టెంబర్ 5న డబ్ల్యూసీఎల్ సీఎండీ హేమంత్ శరద్ పాండేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల వైద్య చికిత్స, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి న ప్రక్రియలను ఆరోగ్య పోర్టల్ ద్వారా వేగవంతంగా, పారదర్శ కంగా నిర్వహించే అవకాశం ఉందన్నారు. అయితే విశ్రాంత ఉద్యోగులను ఈ సౌకర్యానికి దూరంగా ఉంచడం వల్ల చికిత్సకు సంబంధించిన ప్రక్రియలు, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌లో అనవసరమైన జాప్యం జరుగుతోందని సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సీపీఆర్ఎంఎస్--ఎన్ఈ పరిధిలోని అన్ని విశ్రాంత ఉద్యోగులను ఆరోగ్య పోర్టల్‌కు అనుసంధానం చేయాలని ఆయన కోరారు. దీనివల్ల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వైద్య చికిత్స, రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన ప్రక్రియలను సులభంగా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. అదేవిధంగా అమృత్ ఫార్మసీ ద్వారా విశ్రాంత ఉద్యోగులకు రాయితీ ధరలకు మందులు అందించాలని కూడా డిమాండ్ చేశారు. వయోభారం కారణంగా వివిధ అనారోగ్య సమస్యలకు నిరంతరం మందులు వినియోగించే విశ్రాంత ఉద్యోగులకు తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ అంశాలపై డబ్ల్యూసీఎల్ సీఎండీ హేమంత్ శరద్ పాండేతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఆయన సానుకూలంగా స్పందించారు. విశ్రాంత ఉద్యోగులను ఆరోగ్య పోర్టల్‌కు అనుసంధానం చేయడంతో పాటు, అమృత్ ఫార్మసీ ద్వారా రాయితీ ధరలకు మందులు అందించే సౌకర్యాన్ని త్వరితగతిన కల్పించేందు కు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డబ్ల్యూసీఎల్ సీఎండీ తీసుకున్న సానుకూల నిర్ణయం పట్ల విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సౌకర్యాలు అమలులోకి వస్తే వైద్య చికిత్స, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రక్రియల్లో జాప్యం తగ్గడంతో పాటు వ్యవస్థ మరింత పారదర్శకంగా మారే అవకాశం ఉంది. అమృత్ ఫార్మసీ ద్వారా రాయితీ ధరలకు మందులు అందుబాటులోకి రావడం వల్ల విశ్రాంత ఉద్యోగులపై పడుతున్న వైద్య ఖర్చుల భారం కూడా తగ్గనుంది. అదే సమయంలో సీపీఆర్ఎంఎస్--ఎన్ఈపై వైద్య వ్యయాన్ని నియంత్రించేందుకు కూడా ఈ చర్యలు దోహదపడే అవకాశం ఉందని హెచ్ఎంఎస్ నాయకులు తెలిపారు

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆర్థిక సహాయం



**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్ శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన చందనల కిషన్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వెంటనే స్పందించారు. కిషన్ వైద్య ఖర్చుల కోసం రూ. 20,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కిషన్ కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ఎమ్మెల్యే స్పందించి ఆర్థిక సహాయం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, అవసరమైన వారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారి సుధాకర్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ బజార్‌పై బడా వ్యాపారుల కన్ను!

### సింగరేణి సూపర్‌బజార్‌ను ప్రైవేటీకరిస్తే సహించం

### సింగరేణి యాజమాన్యమే నిర్వహించాలి

### విప్లవ కార్మిక సంఘాల నాయకులు

**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సింగరేణి సూపర్ బజార్‌లను బడా వ్యాపారస్తుల చేతుల్లో పెట్టే ఆలోచనను సింగరేణి యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సూపర్‌బజార్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే దాని అసలు లక్ష్యమే నీరుగారిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందిస్తూ వస్తున్న సూపర్‌బజార్ కేవలం ఒక వ్యాపార సంస్థ కాదని, అది సింగరేణి కార్మిక సంక్షేమ వ్యవస్థలో అంతర్భాగమని నాయకులు పేర్కొన్నారు. గతంలో సూపర్‌బజార్ల ద్వారా కార్మికులకు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు అందించడంతో పాటు క్రెడిట్ సౌకర్యం కూడా ఉండేదని గుర్తుచేశారు. ప్రైవేటు చేతుల్లో పెడితే ప్రయోజనం ఎవరికి? సూపర్‌బజార్‌ను బడా వ్యాపారస్తులకు అప్పగిస్తే కార్మికుల ప్రయోజనాల కంటే వ్యాపార లాభాలకే ప్రాధాన్యత దక్కే అవకాశం ఉందని వారు అన్నారు. బయట మార్కెట్‌లో అధిక ధరలకు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే చివరకు దాని భారం సింగరేణి కార్మిక కుటుంబాలపైనే పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల చెమటతో నడిచే సింగరేణి సంస్థకు చెందిన సంక్షేమ సదుపాయాన్ని ప్రైవేట్ లాభాల కోసం అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సూపర్ బజార్ నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దాలని, సిబ్బంది కొరత, సరుకుల సరఫరా, పర్యవేక్షణ, నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. గతంలో సూపర్‌బజార్ల లో పర్యవేక్షణ లోపాలు, నిర్వహణ సమస్యలపై ఆరోపణలు వచ్చినప్పటికీ వాటిని పరిష్కరించకుండా సూపర్‌బజార్‌ను బడా వ్యాపారస్తులకు అప్పగించడం సరైన పరిష్కారం కాదని స్పష్టం చేశారు. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సూపర్‌బజార్‌లను ఆధునీకరించాలని నాయకులు సూచించారు. ఆన్‌లైన్ విక్రయాలు, డిజిటల్ బిల్లింగ్, పారదర్శక స్టాక్ నిర్వహణ, కఠినమైన ఆడిట్ విధానం, మెరుగైన పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టి సూపర్‌బజార్‌లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సూపర్‌బజార్‌లను యాజమాన్యమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటైన సూపర్‌బజార్‌ను బడా వ్యాపారస్తులకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కార్మిక సంఘాలు, కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతారని విప్లవ కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి. మణిరామ్ సింగ్, టీ.ఎన్.టి.యూ.సీ. (ఎస్.సీ.ఎల్.యూ.) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అంబాల మహేందర్, సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్.జీ.కె.ఎస్.) రాష్ట్ర నాయకులు, ఎం. పోచమల్లు, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏ.ఐ.ఎఫ్.టి.యూ.) రాష్ట్ర కార్యదర్శి, గజ్జె దుర్గయ్య, బెల్లంపల్లి పట్టణ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, మధునయ్య, రాజు, ఏ.ఐ.ఎఫ్.టి.యూ. రీజియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణిని కమిషన్ సంస్థగా చూస్తున్న కాంగ్రెస్ మంత్రులు

**సింగరేణిని సర్వనాశనం చేసేందుకు కుట్రలు**

**సింగరేణి పరిరక్షణకు టీబీజీకేఎస్ బలమైన శక్తిగా ఎదగాలి**

**ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీబీజీకేఎస్‌దే విజయం**

**బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ పరిరక్షణ సదస్సు**

**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణిలో అవినీతి, కమిషన్ల కోసమే సైట్ విజిట్ విధానాన్ని ప్రవేశపెట్టారని, సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు ఒక కమిషన్ సంస్థగా చూస్తున్నారని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా విమర్శించారు. సింగరేణి సంస్థను సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత కోసం టీబీజీకేఎస్ ఒక బలమైన శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను కార్మికులు, ప్రజల ముందు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీబీజీకేఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన ఆదివారం బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ పరిరక్షణ, కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ మోసపూరిత హామీలపై నిరసన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొప్పుల ఈశ్వర్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కొప్పుల ఈశ్వర్ అన్నారు. కార్మికులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలపై సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు కూడా సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే కార్మికులకు హక్కులు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించడంతో పాటు సంక్షేమ వసతులు కల్పించామని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. సుమారు 1,950 ఉద్యోగ నియామకాలు చేపట్టి యువతకు ఉపాధి కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కారుణ్య నియామకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా కొనసాగించలేకపోతోందని విమర్శించారు. కార్మికుల పిల్లలు కారుణ్య ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విజిలెన్స్ వేధింపుల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలకు సంబంధించిన వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నలు లేవనెత్తినా యాజమాన్యం సరైన సమాధానం చెప్పలేకపోతోందన్నారు. సింగరేణిలోని ఐదు ఏరియాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాలను హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కార్మికులకు వివరించారని చెప్పారు. మెడికల్ బోర్డుతో కార్మికులకు అన్యాయం. 15 నెలల కాలంలో నాలుగు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కేవలం కొద్దిమందికి మాత్రమే మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రయోజనం కల్పించారని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మెడికల్ బోర్డుకు హాజరైన వేలాది మంది కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఉద్యోగాలు పొందాల్సిన కార్మికుల పిల్లలు నష్టపోతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లించాలి. సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే విధంగా విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన భారీ బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి సింగరేణిని ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి లెక్కలను ప్రజలకు, కార్మికులకు వెల్లడించాలని కోరారు. సింగరేణిలో రూ.100 కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ దీనిపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల ఉద్యోగ భద్రత, సంస్థ అభివృద్ధి కోసం తమ పార్టీ, టీబీజీకేఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలకు టీబీజీకేఎస్ సిద్ధం. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పరిమితి ముగిసిందని, ఈ నెల 8తో గుర్తింపు హోదా పూర్తవుతుందని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు టీబీజీకేఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో టీబీజీకేఎస్‌ను బలమైన కార్మిక సంఘంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు కార్మికులకు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను కార్మికుల ముందుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

**కేసీఆర్ వల్లే సింగరేణిలో కొత్త రక్తం- మంచిర్యాల జిల్లా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మంచిర్యాల జిల్లా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ సింగరేణిలో కొత్త రక్తం నింపటానికి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది ఉద్యోగాలు కల్పించామని,ఆ ఉద్యోగాల వల్లే నేడు సింగరేణిలో పెద్ద సంఖ్యలో యువత పనిచేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోయి ఉంటే సింగరేణిలో ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉండేదన్నారు. సింగరేణి సంస్థపై ఒత్తిడి పెంచుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంస్థను దోచుకుంటున్నారని నడిపెల్లి



దివాకర్‌రావు ఆరోపించారు. విలాసవంతమైన జీవితం కోసం చేస్తున్న ఖర్చులను సైతం సింగరేణి నుంచి భరించే పరిస్థితి ఉందని ఆరోపించారు. మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఓసీపీల టెండర్ల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, అదనపు రేట్లతో పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. సింగరేణిని అవినీతికి నిలయంగా మార్చారని విమర్శించారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు కార్మికులకు హామీ ఇచ్చిన సొంతింటి కల పథకం ఏమైందని ఆయన ప్రశ్నించారు. నస్పూర్, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో కేసీఆర్ ప్రభుత్వం సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇప్పించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం స్థానికంగా అక్రమ వసూళ్లకు తెరలేపారని ఆరోపించారు. నస్పూర్, మంచిర్యాల పట్టణాల్లో కలిపి వేలాది ఇళ్లను 22-ఏ జాబితాలో చేర్చారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత 22-ఏ సమస్యను పరిష్కరిస్తామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**కార్మికుల సమస్యల పరిష్కారంలో సంఘాలు విఫలం- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలోని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. సింగరేణి సంస్థను, కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు టీబీజీకేఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విద్యుత్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే. సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పట్టేం లక్ష్మణ్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికల సంపత్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి వెంగళ కుమారస్వామి, సాధుల భాస్కర్, వెంకటరెడ్డి, ఉత్తేజ్ రెడ్డి, గొర్ల సంతోష్, పట్టణ మాజీ అధ్యక్షుడు సుబ్బయ్య, మాజీ కార్యదర్శి మెరుగు పవన్, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు హైమద్ కుమార్, వంగ తిరుపతి, నాయకులు జి. రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**అభివృద్ధి పనులను పక్కన పెట్టారు: బాల్క సుమన్**

**రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి): క్యాతనపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ ఆరోపించారు. ఆదివారం క్యాతనపల్లిలోని తన నివాసంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గానికి మంజూరైన అనేక అభివృద్ధి పనులు ప్రస్తుత ప్రభుత్వంలో నిలిచిపోయాయని అన్నారు. మందమర్రి అభివృద్ధికి మంజూరైన రూ.24 కోట్లు, బీఎంఎల్టీకి సంబంధించిన రూ.11.01 కోట్ల నిధులు, 100 పడకల ఆసుపత్రి, మహిళా భవనాలు, వంతెనల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రూ.1,549 కోట్ల అంచనా వ్యయంతో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా చేపట్టిన చెన్నూరు ఎత్తిపోతల పథకం పనులను ఎందుకు నిలిపివేశారో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లో పేదలు, కార్మికులకు సింగరేణి క్వార్టర్ల ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక నిరుద్యోగులకు ఇచ్చిన 40 వేల ఉద్యోగాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సరికాదని బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్ అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నిలిచిపోయిన అభివృద్ధి పనులను పునఃప్రారంభించి, ఎన్నికల హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



సమావేశంలో మిరియాల రాజిరెడ్డి, మాజీ జిల్లా జెడ్పీ చైర్మన్ మూలరాజిరెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సంధ్యారాణి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవుల విషయంలో బీసీలకు అన్యాయం చేస్తే సహించము

## కొండా సురేఖను వెంటనే మంత్రి వర్గంలోకి తీసుకోవాలి పెద్ద పదవులు అగ్రవర్ణాలకా.. చిన్న పదవులు బీసీలకా?

## బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు కేటాయించాలి నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

## బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గాదె సత్యం, అంబిలపు శ్రీనివాస్ హెచ్చరిక

**మంచిర్యాల, 6,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలను రాజకీయంగా అణగదొక్కడానికి కుట్రలు జరుగుతున్నాయని బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గాదె సత్యం, అంబిలపు శ్రీనివాస్ ఆరోపించారు. మంచిర్యాల పట్టణంలోని రామ్‌నగర్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో చాలామంది నాయకులు పార్టీ లైన్ దాటి మాట్లాడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కేవలం కొండా సురేఖ విషయంలోనే ఎందుకు కక్షపూరితంగా వ్యవహరించారని ప్రశ్నించారు. కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన రాజకీయ వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేస్తూ క్రమశిక్షణా చర్యల పేరుతో మంత్రి పదవి నుంచి తొలగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. ఒక బీసీ బిడ్డ అయిన కొండా సురేఖకు న్యాయం చేయాల్సింది పోయి మంత్రి పదవి నుంచి తొలగించడం సరికాదని, ఆమెను వెంటనే రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలోకి తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె భర్త పేరుతో డబ్బు వ్యవహారాలను తెరపైకి తీసుకురావడం బ్లాక్‌మెయిల్ రాజకీయాల్లో భాగమేనని వారు ఆరోపించారు. బీసీ బిడ్డగా సుస్మితా పటేల్ మాట్లాడిన దాంట్లో తప్పేముందని, ఆమె ఎందుకు మాట్లాడకూడదని ప్రశ్నించారు. బిడ్డ మాట్లాడితే తల్లికి శిక్ష ఎలా విధిస్తారని నిలదీశారు. కొండా సురేఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వాన్ని నిలదీయలేదని, ముఖ్యమంత్రిని విమర్శించలేదని



గుర్తుపెట్టుకోవాలని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రాతిపదికన రావాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం, పదవులు దక్కడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం 17 మంది మంత్రులు ఉండగా మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని, తాజాగా కొండా సురేఖ పదవి కూడా ఖాళీ కావడంతో మొత్తం మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 60 శాతం రిజర్వేషన్‌కు అనుగుణంగా జనాభా ప్రాతిపదికన ఆ మూడు మంత్రి పదవులను మూడు బీసీ సామాజిక వర్గాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవులు కావచ్చు, కార్పొరేషన్ పదవులు కావచ్చు, ఇతర కీలక పదవులు కావచ్చు.. అధిక శాతం అగ్రవర్ణాలకే కేటాయించడం సరికాదన్నారు. పెద్ద పోస్టులన్నీ అగ్రకులాల వారికి, చిన్న పోస్టులన్నీ బీసీలకేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని బీసీ నాయకులు పార్టీలకు అతీతంగా బీసీలకు పదవుల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపాలని పిలుపునిచ్చారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా వారిని భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించిన వారు, బీసీల సహనాన్ని పరీక్షిస్తే ఉద్యమం మరింత ఉధృతంగా మారుతుందని హెచ్చరించారు. దీనికి తెలంగాణ ఉద్యమమే సాక్ష్యమని తెలిపారు. 'విభజించి పాలించు' అనే రోజులు పోయాయని, బీసీలంతా ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడే రోజులు వచ్చాయని అన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే అగ్రవర్ణాల వారు కూడా బీసీల పట్ల జరుగుతున్న అన్యాయానికి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బీసీ ప్రజలు తిరగబడక ముందే ప్రభుత్వం మేల్కొని సామాజిక న్యాయం కల్పించాలని, అధిక శాతం మంత్రి పదవులు, కార్పొరేషన్ పదవులు, ఇతర నామినేటెడ్ పదవులను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని కొండా సురేఖను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంచిర్యాలలో జరిగిన ఈ సమావేశంలో నరెడ్ల శ్రీనివాస్, కార్పొరేటర్, మైనార్టీ సంఘం నాయకులు ఎం.డి. సత్తార్, పద్మశాలి సంఘం నాయకులు అంకం నరేష్, మున్నూరు కాపు సంఘం నాయకులు తోట తిరుపతి, రాజు పటేల్, పెరక సంఘం నాయకులు గొల్ల రాజలింగు, రజక సంఘం నాయకులు లింగమూర్తి, గౌడ్ సంఘం నాయకులు బాలు గౌడ్, కుమ్మరి సంఘం నాయకులు రమేష్, మున్నూరు కాపు సంఘం నాయకులు మొగిలి సత్యం, తిరుపతి, ఎడ్ల కిషన్, ఎగ్గన మల్లేష్, ఓడ్నాల రవీందర్, మల్క భూమయ్య, చంద్ర మోహన్, వినుకొండ రవి, డీ. లచ్చయ్య, సీపతి రవి, సామల నరేష్, హరీష్, సంతోష్, ఎం.డి. వహిద్, బోలిశెట్టి అంజన్న, కంచెర్ల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఏర్పాట్లపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సమీక్ష

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలి







**మంచిర్యాల, 6, సెప్టెంబర్ రాజయ్య ( ప్రజా జ్యోతి): నియోజకవర్గం** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సూచించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటు, గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మండపాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.మండపాల నిర్వాహకులకు అధికారులు అవసరమైన సహకారం అందించాలని, అదే సమయంలో ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మండపాల కమిటీ సభ్యులు కూడా అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో శ్రీరాంపూర్ సింగరేణి జీఎం శ్రీనివాస్, ఏసీపీ ప్రకాశ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, వివిధ శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ మంగిలాల్, గుండ సుధాకర్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో జర్నలిస్టును అవమానిస్తే సహించేది లేదు

## ఆడు ఇక్కడ రిపోర్టర్ కాదు" అంటూ ప్రజల సమక్షంలో వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు

## వార్డు సభ్యులు,ఇతర వారి తీరుపై సమగ్ర విచారణకు డిమాండ్

## ప్రజాస్వామ్య వేదికపై మీడియా ప్రతినిధులను కించపరచడం సరికాదని జర్నలిస్టు వర్గాల ఆగ్రహం

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):** ప్రజల సమస్యలను చర్చించి, గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన గ్రామసభలో ఒక జర్నలిస్టును ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు వాంకిడి మండలంలోని ఓ గ్రామపంచాయతీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆడు ఇక్కడ రిపోర్టర్ కాదు అంటూ ప్రజల సమక్షంలో మాట్లాడటం ద్వారా జర్నలిస్టు వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరిగిందని జర్నలిస్టు వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గ్రామసభ అనేది కేవలం ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం మాత్రమే కాదు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సమస్యలు చర్చకు వచ్చే ప్రజాస్వామ్య వేదిక. ఇలాంటి వేదికపై ప్రజా సమస్యలను కవర్ చేసేందుకు వచ్చిన మీడియా ప్రతినిధిని అవమానకరంగా సంబోధించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి.. అవమానించకూడదు

గ్రామంలో ఏదైనా సమస్యపై జర్నలిస్టు ప్రశ్నిస్తే, సంబంధిత ప్రజాప్రతినిధులు లేదా అధికారులు వాస్తవాలను వివరించాలి. వార్తలో తప్పులు ఉన్నాయని భావిస్తే ఖండన ఇవ్వవచ్చు. తమ వివరణను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయవచ్చు. అవసరమైతే చట్టపరమైన మార్గాలను కూడా అనుసరించవచ్చు. అంతేకానీ ప్రజల సమక్షంలో జర్నలిస్టు హోదాను ప్రశ్నిస్తూ, వ్యక్తిగతంగా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని జర్నలిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి.

### జర్నలిస్టు గుర్తింపు ఎవరు నిర్ణయిస్తారు?

ఒక వ్యక్తి జర్నలిస్టుగా పనిచేస్తున్నాడా లేదా అన్న అంశాన్ని నిర్ధారించడానికి సంబంధిత మీడియా సంస్థ, గుర్తింపు పత్రాలు, వృత్తిపరమైన ఆధారాలు వంటి అంశాలు పరిశీలించవచ్చు. కానీ గ్రామసభలో ప్రజల సమక్షంలో ఒక వ్యక్తిని రిపోర్టర్ కాదు అంటూ అవమానకరంగా ప్రకటించడం సరైన అధికారిక విధానం కాదని పలువురు అంటున్నారు. అసలు ఆ వ్యాఖ్యలు ఏ సందర్భంలో వచ్చాయి? ఎవరు చేశారు? ఏ ఉద్దేశంతో చేశారు? జర్నలిస్టు విధులకు ఆటంకం కలిగించే ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉందని డిమాండ్ వినిపిస్తోంది.

### వార్డు సభ్యుల పాత్రపై కూడా విచారణ అవసరం

ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డు సభ్యులు, ఇతర పాలకవర్గ సభ్యుల పాత్రను కూడా అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించాలని కోరుతున్నారు. ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు లేదా సమావేశంలో వృత్తిపరమైన విధులకు ఆటంకం కలిగించినట్లు ఆధారాలతో తేలితే, వర్తించే చట్టాలు, స్థానిక సంస్థల నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే విచారణ పూర్తయ్యే వరకు ఎవరి మీదా ముందస్తుగా నేరారోపణలు చేయకుండా, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరుతున్నారు.

### గ్రామసభలో జరిగిన ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలి

గ్రామసభలో ప్రజల సమక్షంలో జరిగే చర్చలు పారదర్శకంగా ఉండాలి. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రశ్నలు వస్తే వాటికి సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్య పద్ధతి. మీడియా ప్రతినిధులు కూడా తమ బాధ్యతను గుర్తించి వాస్తవాలను ధృవీకరించి వార్తలు అందించాలి. అదే సమయంలో ప్రజాప్రతినిధులు కూడా మీడియా ప్రశ్నలను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.

### మీడియాపై ఒత్తిళ్లకు తావివ్వకూడదు

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా పనిచేసే వాతావరణం ఉండాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. గ్రామస్థాయిలో ఒక సమస్యను రిపోర్ట్ చేసినప్పుడు సంబంధిత వ్యక్తులు వివరణ ఇవ్వడం సహజం. కానీ వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు, బెదిరింపులకు దారితీసే వాతావరణం ఏర్పడితే అది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొంటున్నారు.

### ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి

గ్రామసభలో జరిగినట్లు చెబుతున్న ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. గ్రామసభ రికార్డులు, సమావేశానికి హాజరైన వారి వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న వీడియో రికార్డింగులు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. విచారణలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే, వారు ఏ పదవిలో ఉన్నా చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### ప్రజాస్వామ్యంలో మీడియాకు గౌరవం తప్పనిసరి




ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే బాధ్యత మీడియాపై ఉంటుంది. గ్రామస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, అభివృద్ధి లోపాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక జర్నలిస్టుల పాత్ర కీలకం. అందుకే మీడియా ప్రతినిధులతో ప్రజాప్రతినిధులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు పరస్పర గౌరవంతో వ్యవహరించాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

### వార్త నచ్చకపోతే వివరణ ఇవ్వాలి..

ప్రశ్న నచ్చకపోతే సమాధానం చెప్పాలి.. కానీ ప్రశ్నించిన వ్యక్తి వృత్తిని కించపరిచే హక్కు ఎవరికీ లేదు అనే అభిప్రాయం ఈ ఘటన నేపథ్యంలో బలంగా వినిపిస్తోంది. తప్పు జరిగితే చర్య.. నిజం తేలితే స్పష్టత ఈ వ్యవహారంపై విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని, తప్పు చేసినట్లు తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తమ వాదనను వినిపించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గ్రామసభలు ఇకపై ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా నిలవాలని, వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, జర్నలిస్టు వర్గాలు కోరుతున్నాయి. ప్రశ్నించే గొంతును అణచివేయడం కాదు.. ప్రశ్నకు సమాధానం ఇవ్వడమే ప్రజాస్వామ్య సంస్కృతి. గ్రామసభలో మీడియా ప్రతినిధి గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరించినట్లు నిర్ధారణ అయితే, పదవి లేదా హోదాతో సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి

# పెరట్లో గంజాయి సాగు.. 68 ఏళ్ల వ్యక్తి అరెస్ట్!

**9 గంజాయి మొక్కలు స్వాధీనం.. విలువ రూ.60 వేలు**

**కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు**

**ఆసిఫాబాద్ సెప్టెంబరు 6 ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టార్ మున్నా ఖాన్** చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో గంజాయి మొక్కల అక్రమ సాగుపై పోలీసులు దాడులు నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు కౌటాల సీఐ, చింతలమానేపల్లి ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కుంబారి శంకర్ (68), తండ్రి రాములు తన పెరటి స్థలంలో అక్రమంగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించారు.అక్కడ సాగు చేస్తున్న 9 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.60 వేలుగా అంచనా వేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కౌటాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్‌కుమార్ తెలిపారు.

### సమాచారం ఇవ్వండి

గంజాయి సాగు, విక్రయం, రవాణా, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను సమీప పోలీస్‌స్టేషన్ లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని పోలీసులు ప్రజలను కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# ఘనంగా జర్నలిస్టు డే వేడుకలు

## జర్నలిస్టుల సేవలు అభినందనీయం



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి): జర్నలిస్ట్ కృష్ణపల్లి సురేష్ ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం విలేకరులు అందిస్తున్న సేవలను గుర్తించి, ఉత్తమంగా పనిచేస్తున్న జర్నలిస్టులు అబ్దుల్ రహమాన్, ప్రకాష్ గౌడ్, బాల శ్రీనివాస్, మసాదే సంతోష్ కుమార్, నగరారే తారు, మీర్జా సలీం బేగ్, సురేష్ చారి, మోయిన్, ముబాషీర్, అబ్దుల్ గఫ్ఫార్, సాజిద్ ఖాన్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఉబేద్ బీన్ యహియాలు మాట్లాడుతూ జర్నలిజం కత్తి మీద సాము లాంటి అత్యంత సవాలుతో కూడుకున్న వృత్తి అని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజానికి సేవలందించడం అభినందనీయమని కొనియాడడమే కాకుండా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అడ్వైసర్ అహ్మద్ బీన్ అబ్దుల్లా, అవద్ బీన్ యహియా, సొసైటీ ప్రతినిధులు ఇమ్రాన్ హష్మీ, సల్మాన్ ఖాన్, మన్సూర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా జర్నలిస్టు.. నిజాన్ని నిర్భయంగా రాయడమే బాధ్యత

: కృష్ణపల్లి సురేష్



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):** జర్నలిస్టు దినోత్సవాన్ని పురస్కరించుకుని జర్నలిస్టు మిత్రులందరికీ కృష్ణపల్లి సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వాలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. జర్నలిస్టు అనేవాడు కేవలం వార్తలను సేకరించి ప్రచురించే వ్యక్తి మాత్రమే కాదని, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వాటికి పరిష్కారం లభించే వరకు తన కలంతో పోరాడే అక్షర శ్రమజీవి అని పేర్కొన్నారు. ఎండైనా, వానైనా, పగలైనా, రాత్రైనా ప్రజా సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని సమాజం ముందు ఉంచడం జర్నలిస్టు బాధ్యత అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, విద్య, వైద్యం, రవాణా, ప్రభుత్వ పథకాల అమలు తదితర సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాలు లేకపోయినా, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ జర్నలిస్టులు వార్తా సేకరణకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలోనూ జర్నలిస్టులు ముందుండి పరిస్థితులను ప్రజలకు తెలియజేస్తారని అన్నారు. వరదలు, భారీ వర్షాలు, రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు తదితర ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టుల కృషి ఎంతో ఉందని తెలిపారు. తాను జర్నలిస్టుగా ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యలు, గ్రామీణ ప్రాంతాల ఇబ్బందులు, సామాజిక అంశాలపై వార్తలు రాస్తూ వస్తున్నానని కృష్ణపల్లి సురేష్ తెలిపారు. అనేక సందర్భాల్లో వార్తల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యకు పరిష్కారం లభించిన ప్రతిసారి జర్నలిస్టుగా తన బాధ్యత సార్థకమైందనే భావన కలుగుతుందని అన్నారు. వార్త రాయడంలో వాస్తవాలను తెలుసుకోవడం, సంబంధిత వ్యక్తుల అభిప్రాయాలను తీసుకోవడం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. జర్నలిజం అనేది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ ప్రయోజనం కోసం పనిచేసే బాధ్యతాయుతమైన వృత్తి అని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం దృష్టికి చేరని అనేక సమస్యలు మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయని, ఒక చిన్న వార్త కూడా కొన్నిసార్లు పెద్ద మార్పుకు కారణమవుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల కృషిని సమాజం గుర్తించాలని అన్నారు. అదేవిధంగా జర్నలిస్టులు కూడా వార్తల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ నిజానిజాలను పరిశీలించి, ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. జర్నలిస్టు కలం సమాజానికి అద్దంలా ఉండాలని, నిజాన్ని నిజంగా చూపించే బాధ్యతను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న ప్రతి జర్నలిస్టుకు ఈ సందర్భంగా కృష్ణపల్లి సురేష్ అభినందనలు తెలిపారు. జర్నలిస్టులపై ప్రజల్లో మరింత నమ్మకం పెరగాలంటే వాస్తవాధారిత మైన, బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగించాలని అన్నారు. కొత్త తరానికి చెందిన జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ఆధునిక మీడియా వేదికలను ఉపయోగించుకుంటూ ప్రజా సమస్యలను మరింత విస్తృతంగా సమాజం ముందుకు తీసుకురావాలని సూచించారు. అక్షరమే ఆయుధంగా... నిజమే లక్ష్యంగా... ప్రజలే కేంద్రంగా పనిచేసే ప్రతి జర్నలిస్టుకు వందనం.జర్నలిస్టు దినోత్సవం సందర్భంగా జర్నలిస్టు మిత్రులందరికీ కృష్ణపల్లి సురేష్ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల కలాలు మరింత బలంగా మారాలని, ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను చూపిస్తూ సమాజ మార్పులో మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## వ్యవసాయ పొలంలో గంజాయి సాగు.. ఒకరిపై కేసు

రెండు గంజాయి మొక్కలు స్వాధీనం.. వ్యవసాయ అధికారి, పంచాయితీ సాక్షుల సమక్షంలో తనిఖీలు



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి జిల్లా క్రైమ్ రిపోర్టర్ మున్నా ఖాన్** విశ్వసనీయ సమాచారం మేరకు కెరమెరి పోలీసులు గంజాయి అక్రమ సాగుపై దాడి నిర్వహించారు. మండలంలోని బాబేజరి గ్రామపంచాయతీ పరిధి శివగూడకు చెందిన ఆత్రం భీంరావ్ తన వ్యవసాయ పొలంలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంబంధిత పొలానికి వెళ్లి వ్యవసాయ అధికారి, పంచాయితీ సాక్షుల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న రెండు గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆత్రం భీంరావ్‌ను అదుపులోకి తీసుకుని పంచాయితీ సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలతో పాటు నిందితుడిని కెరమెరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం ఆత్రం భీంరావ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని కెరమెరి పోలీసులు హెచ్చరించారు.

## లక్ష్మీకాంతపూర్, మ్యాదరపేట్ గ్రామాల్లో పర్యటించిన మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



**దండేపల్లి సెప్టెంబర్06 (ప్రజాజ్యోతి ):** మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి మండలంలో ఆదివారం పలు సామాజిక, పరామర్శ కార్యక్రమాల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. మండలంలోని లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ మహేష్ తండ్రి గారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సురేఖ ప్రేమ్ సాగర్ రావు వారి నివాసానికి వెళ్ళి మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మహేష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యాన్ని నింపారు.అనంతరం మ్యాదరపేట్ గ్రామంలో నిర్వహించిన డాక్టర్ మర్రి ప్రవీణా రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకల్లో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఆర్టీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, దండేపల్లి మండల మాజీ ఎంపీపీలు అక్కల శకుంతల, జాబ్ కాంతారావుతో పాటు స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకానికి ప్రతీకగా.. 4వ వార్డు మెంబర్ మహేశ్వరి!

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..వార్డు అభివృద్ధికి అంకితభావంతో అడుగులు

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):**ప్రజాప్రతినిధి అంటే కేవలం పదవిలో ఉండటం కాదని.. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే నిజమైన ప్రజాసేవ అని నిరూపించేలా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ 4వ వార్డు మెంబర్ మహేశ్వరి తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వార్డు ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ, ప్రజలకు ఎప్పుడు అవసరం వచ్చినా అందుబాటులో ఉండేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. వార్డులోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని స్థానికులు అంటున్నారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారని పేర్కొంటున్నారు.

**సమస్య వింటే.. పరిష్కారం కోసం ప్రయత్నం**

ప్రజలు తమ సమస్యను చెప్పిన వెంటనే దాన్ని పట్టించుకోకుండా వదిలేయకుండా, సమస్య తీవ్రతను తెలుసుకుని పరిష్కారం కోసం ప్రయత్నించడం మహేశ్వరి పనితీరులో ప్రధాన లక్షణంగా స్థానికులు చెబుతున్నారు. చిన్న సమస్య అయినా.. పెద్ద సమస్య అయినా ప్రజలకు ఇబ్బంది కలిగించే అంశాలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత వ్యక్తులు, అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు.వార్డులో ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే ముందుగా స్పందించే ప్రజాప్రతినిధిగా ఆమెకు మంచి పేరు వస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి అభిప్రాయాలను గౌరవించడం, అందరితో సమన్వయంగా వ్యవహరించడం వంటి అంశాలు ఆమెను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాయని చెబుతున్నారు.

**అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ**

గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. వాటి ప్రయోజనాలు నేరుగా ప్రజలకు అందాలని మహేశ్వరి కోరుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. వార్డుకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటి కోసం సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆమె కృషి చేస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రజలకు అవసరమైన చోట రహదారులు మెరుగుపడటం, పారిశుధ్యం పటిష్టం కావడం, తాగునీటి సమస్యలు తొలగడం, వీధిదీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరుకుంటున్నారని చెబుతున్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలని భావిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారని అంటున్నారు.



**మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత**

మహిళా ప్రజాప్రతినిధిగా మహిళల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం మహేశ్వరి మరో ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆమె ముందుంటున్నారని చెబుతున్నారు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకునే వాతావరణం కల్పిస్తూ వారికి అండగా నిలవడం అభినందనీయమని స్థానిక మహిళలు అభిప్రాయపడుతున్నారు.యువతకు ప్రోత్సాహం.. గ్రామానికి మంచి పేరు రావాలనే ఆకాంక్ష గ్రామంలోని యువత అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర ఉండాలని మహేశ్వరి భావిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, గ్రామంలో సామాజిక ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలకు సహకరించాలని ఆమె ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ఒక్కరి కృషి సరిపోదని.. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేసినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె అభిప్రాయపడుతున్నారని చెబుతున్నారు.

**ప్రజలతో మమేకమై.. సాదాసీదా వ్యవహారశైలి**

పదవి వచ్చిన తర్వాత ప్రజలకు దూరంగా కాకుండా.. గతంలో ఉన్న పరిచయాలను కొనసాగిస్తూ సాధారణంగా ప్రజలతో కలిసిమెలిసి ఉండటం మహేశ్వరి ప్రత్యేకతగా స్థానికులు చెబుతున్నారు. వార్డు ప్రజలు ఎవరైనా తమ సమస్యను చెప్పేందుకు వచ్చినప్పుడు వారి మాటలను శ్రద్ధగా వినడం, సమస్యను అర్థం చేసుకోవడం, సాధ్యమైన పరిష్కార మార్గాన్ని సూచించడం ఆమె వ్యవహారశైలిలో కనిపిస్తుందని అంటున్నారు. ప్రజాప్రతినిధిగా తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాజకీయాలకు అతీతంగా.. ప్రజా ప్రయోజనమే ప్రధానంగా గ్రామంలో అభివృద్ధి విషయంలో రాజకీయ భేదాలకు అతీతంగా అందరి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని మహేశ్వరి భావిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వార్డులోని ప్రతి కుటుంబానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారని పేర్కొంటున్నారు. ప్రజలకు ఉపయోగపడే పనుల విషయంలో అందరి సహకారం తీసుకుని ముందుకు వెళ్లడం ద్వారా వార్డు మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షిస్తున్నారని అంటున్నారు.

**ముందున్న రోజుల్లో మరింత సేవ చేయాలనే లక్ష్యం**

ఇప్పటివరకు చేసిన సేవతో సంతృప్తి చెందకుండా.. రానున్న రోజుల్లో కూడా ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో మహేశ్వరి ముందుకు సాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తూ వాటిని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం చేయాలని ఆమె భావిస్తున్నారని పేర్కొంటున్నారు.

**ప్రజల సమస్యను వినే మనసు..**

పరిష్కారం కోసం ప్రయత్నించే తత్వం.. వార్డు అభివృద్ధిపై నిబద్ధత.. ప్రజలతో సన్నిహితంగా ఉండే స్వభావం కలగలిపిన మహేశ్వరి, సరండి గ్రామపంచాయతీ 4వ వార్డుకు మంచి ప్రజాప్రతినిధిగా నిలవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని మరింత బలపరుచుకుంటూ, వార్డు అభివృద్ధిలో తనదైన ముద్ర వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## సిర్పూర్(టి) మండలంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి

**ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి**

**నో మ్యాపింగ్, హియరింగ్,అనామలిస్ నోటీసుల ప్రక్రియపై సమీక్ష,ఓటరు జాబితా లో పొరపాట్లకు తావు లేకుండా చూడాలి:**




**సెప్టెంబర్ 6,సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-టి మండలంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్ హర్షచౌదరి సర్ నో మ్యాపింగ్, హియరింగ్, అనామలీస్ నోటీసుల ప్రక్రియపై సమీక్ష,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్షచౌదరి అధికారులను ఆదేశించారు. స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా సిర్పూర్ (టి) మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి అక్కడ కొనసాగుతున్న ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మండలంలోని పిఎస్ నంబర్లు 125, 126, 127, 128, 129, 130, 131, 132, 152 పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ హర్ష చౌదరి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న నో మ్యాపింగ్, హియరింగ్, అనామలీస్ నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అవకతవకలు చోటుచేసుకోకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నో మ్యాపింగ్, అనామలీస్ కింద గుర్తించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు.నోటీసులు అందుకున్న అర్హులైన వ్యక్తుల నుంచి వారి అభ్యంతరాలు, వివరణలను నిర్ణీత విధానంలో స్వీకరించి, వాటిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుబాటులో ఉండాల్సిన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను ముందు గానే సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. బి.ఎల్.ఓ, లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఓటరు జాబితాకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సబ్ కలెక్టర్ హర్షచౌదరి సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రత్యేకంగా హియరింగ్ ప్రక్రియలో భాగంగా వచ్చే అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత ఆధారాలను పరిశీలించి పారదర్శకం గా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియలో అధికారులు, బిఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, లోపరహితంగా రూపొందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిర్పూర్-(టి) తహసీల్దార్ మహమ్మద్ రహీముద్దిన్, సూపర్‌వైజర్, సంబంధిత బి ఎల్ ఓ లు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి మొక్కల అక్రమ సాగుపై పోలీసుల దాడి, 60 వేల రూపాయల విలువ గల 9 గంజాయి మొక్కలు స్వాధీనం

**కుంబారి శంకర్ తండ్రి రాములు అనే వ్యక్తి తన పేరడీ స్థలంలో అక్రమంగా సాగు చేస్తుండగా పట్టుబడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రిమాండ్ కు తరలించాం ఎస్.ఐ, కమలాకర్:**

**చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తుల మాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా పోలీస్ అధికారులకు తెలియజేయాలి: తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్:**




**సెప్టెంబర్6,సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజక వర్గంలోని చింతల మానేపల్లి మండలం గూడెం గ్రామంలో గంజాయి మొక్కల అక్రమ సాగు చేస్తున్నారని పోలీసులకు అందిన నమ్మదగిన సమాచారం మేరకు చింతల మానేపల్లి ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి గంజాయి మొక్కల అక్రమ సాగు పై దాడులు నిర్వహించారు. 60 వేల రూపాయల విలువగల 9 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని గంజాయి మొక్కలు సాగు చేస్తున్న కుంబారి శంకర్ తండ్రి రాములు 68 సంవత్సరాలు అనే వ్యక్తిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్సై కమలాకర్ ప్రకటనలు తెలిపారు. కౌటల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ)సంతోష్ కుమార్ మాట్లాడుతూ... చింతల మానేపల్లి మండలం గూడెం గ్రామంలో గంజాయి మొక్కల అక్రమ సాగుపై వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు చింతల మానేపల్లి ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా కుంబారి శంకర్ తండ్రి రాములు 68 సంవత్సరాలు గల వ్యక్తి తన పేరడీ స్థలంలో సాగు చేస్తుండగా పట్టుబడాడని అన్నారు. అతని వద్ద నుండి 9 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సిఐ సంతోష్ కుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.60,000/- గా ఉంటుందని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. నిందితున్ని రిమాండ్ కు తరలించడం జరిగిందని అన్నారు.గంజాయి సాగు,విక్రయం,రవాణా లేదా వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపా లకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి సమాచారం ఉంటే, ప్రజలు సమీప పోలీస్ స్టేషన్కు లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సిఐ సంతోష్ కుమార్ అన్నారు.సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇలాంటి అక్రమ చట్ట విరుద్ధ కార్యకర్తలకు పాల్పడే వారిపై కఠిన చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.

## కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో విధ్వంసం ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

**కోరుట్ల రూరల్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వాన స్థితికి చేరుకున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐలాపూర్ లాపూర్ గ్రామంలో పల్లెల విద్యాభివృద్ధి, పడకేసిన పారిశుధ్యానికి నిరసనగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, పల్లెల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో దాదాపు 6.5 లక్షల గ్రామాలు ఉంటే, ఉత్తమ గ్రామాల విభాగంలో కేంద్రం ప్రకటించిన 40 అవార్డుల్లో ఏకంగా 13 అవార్డులు (33 శాతం) సాధించి తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ నాయకత్వంలో 'పల్లె ప్రగతి' ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠ ధామాలు ఏర్పాటు చేసి పరిశుభ్రతకు పెద్దపీట వేశారని కొనియాడారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా నిధులు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి, పారిశుధ్యం లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాటిన 250 కోట్ల మొక్కలను సంరక్షించాల్సింది పోయి, అభివృద్ధి పనుల పేరిట చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారని ఆరోపించారు. 420 హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్కు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వాలన్నారు. ?తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి పల్లెల అభివృద్ధిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల అధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్. నియోజకవర్గం బి ఆర్ ఎస్ శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు

## ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముత్యాల బలరాం రెడ్డి

**ధర్మారం :** ప్రజలను మోసగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన పాలన చేస్తుందని నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల విఫల పాలనపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఊరూరా ఆదివారం కాంగ్రెస్ ఎన్నికల గ్యారెంటీ కార్డులను ఊరూరా పంపిణీ చేశారు. ధర్మారం మండల కేంద్రంలో నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ బలరాం రెడ్డి, పార్టీ పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరాం రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ పాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క బతకాన్ని సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్ రెడ్డి పొద్దున లేస్తే కేవలం మాజీ సీఎం కేసీఆర్ పైనే ఆరోపణలు చేస్తూ ప్రజా పాలన పేరుతో దగా పాలన చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే రాబోయే కాలంలో ఆ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని బలరాం రెడ్డి హెచ్చరించారు. నంది మేడారంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ధర్మారం మాజీ ఎంపీటీసీ కాంపల్లి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆవులత, నాయకులు దేవి నలిని కాంత్, దేవి వంశీకృష్ణ, కూరపాటి శ్రీనివాస్, నాడెం శ్రీనివాస్, సల్వాజీ మాధవరావు ,గంధం తిరుపతి, అమరపల్లి నారాయణ, వేల్పుల కుమార్, కాంపల్లి అపర్ణ, ఈర్ల వనిత, కల్లేపల్లి లింగయ్య, ఆవుల వేణు, గాండ్ల నర్సయ్య, అయితే వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం.. పోలీసులకు మాజీ మంత్రి పువ్వాడ హెచ్చరిక

**జూలూరుపాడు :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో విధులు నిర్వహించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు పోలీసులు హింసను ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, తప్పుడు చర్యలకు పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తప్పుడు పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సరైన విధులు నిర్వహించి తగిన రీతిలో పనిచేయాలని పోలీసులకు హితవు పలికారు.

## రూ.4 వేల పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్.. వృద్ధుడి ప్రశ్నకు కాంగ్రెస్ ఎమ్మెల్యే రియాక్షన్ ఇదే.

420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల విఫలపాలనపై ఇప్పటికే బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. కాగా కాంగ్రెస్ హామీల పరిస్థితి ఎలా ఉందో తెలియజేసే వీడియో ఇది. రూ.4 వేల పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అంటూ వృద్ధుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేను నిలదీశాడు. అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల సంబరాల కార్యక్రమం నిర్వహించింది. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతున్న సమయంలో సదరు వృద్ధుడు పెన్షన్ ఎప్పుడిస్తారు అని అడిగాడు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. ముందుగా మనం ముందుగా చేసినటువంటి కార్యక్రమాల గురించి చెప్పేందుకు ఈ ప్రోగ్రాంను ఏర్పాటు చేశామంటూ.. పెద్దాయన అడిగిన ప్రశ్నకు జవాబివ్వకుండా దాటవేశాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

## తలాపునే గోదావరి, తాలిపేరు.. బీడు భూమిగా ఏజెన్సీ కోనసీమ

**వర్షాల కోసం రైతన్నల ఎదురు చూపులు**

**దుమ్ముగూడెం :** ఏజెన్సీ కోనసీమగా పేరున్న దుమ్ముగూడెం మండలంలో ఈ ఏడాది వరిపంట సాగు చేయడం రైతులకు కష్టంగా మారింది. మండలంలో పంటలు వేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో సాగునీరు కరువై పంటలు బీడుగా మారుతున్నాయి. మండలంలోని పైడాకుల మడుగులో చిన గుబ్బలమంగి ప్రాజెక్టు ఆయకట్టు కింద 2,550 ఎకరాల వరి సాగు ప్రతి ఏటా చేస్తుంటారు. వర్షాకాలంలో మూడుసార్లు నిండితే పంటలు పండుతాయి. కానీ ఈసారి ఎగువన చత్తీస్గఢ్ లో వర్షాలు లేకపోవడంతో నీరు రాలేదు. ఈ ఏడాది రైతులు నార్లు పోసి ఎదురు చూస్తున్నారు. అలాగే చిన నల్లబెల్లి చెరువు ఆయకట్టు 410 ఎకరాలు సాగులో ఉంది. కాగా ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో రైతులు నార్లు పోసి ఎదురు చూస్తున్నారు. ముందుగా కొంత వర్షం పడటంతో నాట్లు వేశారు. గుబ్బలమంగి ప్రాజెక్టు కింద 2,500 ఎకరాలు ఉండగా 500 ఎకరాలు మాత్రమే వరి సాగు చేశారు. నల్లబెల్లి చెరువు కింద 25 ఎకరాలు సాగు చేశారు. మిగతా భూమంతా బీడు భూములుగా మారాయి. తలాపునే తాలిపేరు కెనాల్ ఉంది. తూరుబాక వరకు తాలిపేరు కెనాల్ ద్వారా సాగునీరు వెళ్తుంది. కాని ఆ ప్రాంతంలో చెరువులు నింపడానికి ఉపయోగం లేదని రైతులు అంటున్నారు. గోదావరి పక్కన ఉన్నప్పటికీ